తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## డేగకళ్ళతో భద్రతపై అప్రమత్తం

### -కాటేజీల ప్రాంతాల్లో ఆక్టోపస్ మాక్‌డ్రిల్

తిరుమల,జూన్ 19ప్రభాతవార్తప్రతినిధి:



తిరుమలకు వచ్చే భక్తుల భద్రత ధ్యేయంగా భద్రత దళాలు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నాయి. కొండపై పోలీసు, ఆక్టోపస్, టిటిడి సెక్యూరిటీ, ఎస్‌పిఎఫ్, ఏపిఎస్‌పి దళాలు, టిటిడి విజిలెన్స్ సెక్యూరిటీ బలగాలు నిరంతరం డేగకళ్ళతో అప్రమత్తంగా నిఘా పర్యవేక్షిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తిరుమలకు ఏదేని ప్రమాదం, తీవ్రవాదులు చొరబడిన పరిస్థితుల్లో భక్తుల రక్షణ, వారిని కాపాడే తీరును భద్రతా బలగాలు మాక్‌డ్రిల్ నిర్వహించాయి.

## నిబంధనలు పాటించని స్కూల్ బస్సులపై దాడులు

తిరుపతి(రవాణ),జూన్ 19ప్రభాతవార్త



తిరుపతిజిల్లాలో నిబంధనలు, సామర్థ్యం లేని స్కూల్‌బస్సులను తనిఖీలు చేస్తూ, విద్యార్థుల భద్రతే ఆశయంగా దాడులు చేసి చర్యలు తీసుకుంటున్నట్లు తిరుపతి రవాణాశాఖ అధికారి కొర్రపాటి మురళీ మోహన్ తెలిపారు. గురువారం కూడా తిరపతి నగరంలో శివార్లలో కాలేజీ, స్కూల్ బస్సులను తనిఖీ చేయడం జరిగిందన్నారు. వాహనసామరథ్యం ధృవీకరణపత్రం, లేఇ బస్సులను నడపరనాదని, ఇదివరకే రవాణాశాఖాధికారి స్కూల్ యాజమాన్యంకు ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. 15 పాఠశాలల బస్సులపై కేసులు నమోదు చేసినట్లు ఆర్టీఒ తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్‌లేకుండా వాహనాలను నడపతున్న, స్కూల్ బస్సులు నడుపుతున్న వారిపై తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలన్నారు.

## మహిళ హత్య

### మెడలోని బంగారు చైను, కమ్మల్లు, కాలి గొలుసు చోరి

### పలు అనుమానం వ్యక్త పరిచిన స్థానికులు

నారాయణవనం/పిచ్చాటూరు, జూన్ 19 ప్రభాతవార్త :



హత్యకు గురైనా కల్పన(40)

సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు మండలం అడవికొడిబేడు అరుందతివాడలో బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న మహిళను గుర్తు తెలియని వ్యక్తులు గొంతుకోసి హత్య చేసిన తర్వాత ఆమె మెడలోని బంగారు చైను, కమ్మలు, కాలి గొలుసులను చోరి చేసి కెళ్లారు. వివరాలు ఇలా.. పిచ్చాటూరు మండలం అడవికొడిబేడు అరుందతి వాడకు చెందిన కల్పన(40) బుధవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఆమె గొంతుకోసి హత్య చేశారు. కల్పన భర్త శ్రీనివాసులు 10 ఏళ్ల క్రితం మృతి చెందాడు. కల్పనకు ఇంటర్ పూర్తి చేసిన కొడుకు వున్నాడు. కుటుంబ పోషణం కోసం కల్పన క్యాటరింగ్ వెళ్లడం జరుగుతుంది. రెండు నెలలుగా చెన్నైలో పని కోసం వెళ్లింది. బుధవారం ఇంటికి వచ్చింది. ఎండాకాలం కావడంతో కల్పన ఆరుబయట పడుకొంది. ఉదయం కల్పన విగతజీవిగా పడి హత్యకు గురైన సమాచారం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందిం చారు. స్థానిక ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని పలు కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసిన తర్వాత బందువులకు అప్పగించారు.

## చివరి కేజీ వరకు మామిడి కొనుగోలు

బంగారుపాళ్యం, జూన్ 19 ప్రభాతవార్త:



మామిడి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

జిల్లాలో పండిన మామిడికి చిట్టచివరి కాయ అమ్ముడుపోయే వరకు ప్రభుత్వం రైతుకు అండగా నిలుస్తోందని, ప్రభుత్వం మామిడి కేజీపై అందించే రూ.4 మద్దతు ధర సబ్సిడీ రూపంలో రైతు వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ చేయడం జరుగుతుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో గురువారం సాయంత్రం మామిడి మండీ యాజమానులు, రైతులతో మామిడి మద్దతు ధరపై కలెక్టర్ సుమిత్‌కుమార్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ తోతాపురి మామిడిని చివరి కేజీ వరకు కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వం పక్కాగా చర్యలు తీసుకుంటోందని, రైతులు ఆందోళన చెంది పక్వానికి రాక ముందే మామిడి కాయలను గుజ్జు పరిశ్రమలకు తరలించవద్దని సూచించారు. మండలాల్లో గ్రామ సభల ద్వారా మామిడి అమ్మకాలపై రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. రైతులు ట్రేడర్స్ మీద ఆధారపడవద్దని, చిన్న, సన్నకారు రైతులు పక్వానికి వచ్చిన మామిడి కాయలను కంపెనీలకు తరలించాలని పిలుపునిచ్చారు. అలాగే తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి జిల్లా అధికారుల కమిటీతో ఒక బృందం పంపడం జరిగిందని, అక్కడ మామిడి కొనుగోలు ఎలా జరుగుతున్నాయి! అక్కడ ధర ఎలా అమలు చేస్తున్నారు! రైతులకు ఎంత మేరకు ధర చెల్లిస్తున్నారు! ఈ విషయాలు తెలుసుకోవడానికి ఒక బృందంకు అక్కడికి పంపడం జరిగిందన్నారు. రెండు రోజుల్లో ఈ బృందం నివేదికలు అందజేయనుందన్నారు. అలాగే జిల్లాలో తోతాపురి మామిడిని రైతులు ఫ్యాక్టరీలకు విక్రయించినా, వర్తకులకు అమ్మినా వారికి ప్రభుత్వం తరపున కేజీకి రూ.4 సబ్సిడీ అందించడం జరుగుతుందన్నారు. అలాగే రైతులకు సలహాలు, సూచనల కోసం ప్రాసెసింగ్ యూనిట్ల వద్ద షిఫ్ట్‌ల వారీగా ప్రభుత్వ ఉద్యోగులకు నియమించడం జరిగిందని, జిల్లాలో మామిడి పండించే రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొకూడదని, సిఎం నిర్ణయం మేరకు ప్రతి రైతుకు కేజీకి రూ.4 మద్దతు ధర చెల్లించడానికి జిఒ జారీ చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, మార్కెటింగ్ శాఖ ఎడి పరమేశ్వర్, ఉద్యానశాఖ డిడి మధుసూధన్‌రెడ్డి, మామిడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జేయన్‌టీయులో స్కిట్ విలీనానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్

**శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని నిరుపేదల పిల్లల ఉన్నత చదువులకు మరో సారి అవకాశం లభించింది.స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల పునఃప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. ఇక మీదట ఇక్కడ పరిపాలనా బాధ్యతను జేయన్‌టియు పర్యవేక్షిస్తుంది. 1999లో పట్టుబట్టి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి హాయాంలో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా దేవాదాయశాఖ పర్యవేక్షణలో ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించారు. 2019-24 మధ్య ఈ కళాశాలను మూసి వేసారు. ఇక ఈ కళాశాల చరిత్ర సమాప్తి అయ్యిందని భావించారు. ఈ నియోజకవర్గంలోని పిల్లలు బయట ప్రాంతాలకు పంపి చదివించే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులకు 2024లో గెలిచిన బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి పట్టుబట్టి పునఃప్రారంభానికి అనుమతి సాధించారు. అన్ని దానాల కన్నా విద్యాదానం మిన్న అని నిరూపించుకున్నారు. నియోజకవర్గ ప్రజల్లో శెహాభాష్ అనిపించుకుంటున్నారు.**

### తండ్రి హయాంలో స్థాపన: తనయుడు హయాంలో పునః ప్రారంభం




శ్రీకాళహస్తి,జూన్ 19 ప్రభాతవార్త

లీడ్( నాడు రాష్ట్రంలో ఇంజనీరింగ్ విద్య ఎంతో ఖరీదైనది. రాష్ట్రంలో అతి తక్కువ ఇంజనీరింగ్ కళాశాలలు ఉండేవి. ఆ సమయంలో శాసనసభ్యుడు, మంత్రిగా ఉన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఎఐటియుసి చైర్మెన్‌ను ఒప్పించి ఇక్కడ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. అప్పటి ఇఒ టి.శివాజిని ఒప్పించి దేవాదాయశాఖ నుంచి రూ.50లక్షల కార్పస్ ఫండ్‌ను చెల్లింపజేసారు. 2009 వరకు ఈ కళాశల రాష్ట్ర ఇంజనీరింగ్ కళాశాలల జాబితాలో మన్నన పొందింది. ఈ కళాశాలకు ప్రభుత్వం 50 ఎకరాల స్థలాన్ని కేటాయించింది, నేడు ఈ స్థలం విలువ సుమారు రూ.300 కోట్లు. కళాశాలకు రాష్ట్రంలోని ప్రముఖులతో పాలక వర్గాన్ని ఏర్పాటు చేసారు. పదేళ్ళ పాటు ఈ కళాశాలలో ఇప్పటికి ఏ కళాశాలలోనూ లేని విధంగా ల్యాబ్‌లు,గ్రంధాలయం, భవనాలను నిర్మించారు. వందల కోట్లు పెట్టుబడి పెట్టారు.ఇదో అద్భుత కళాశాలగా తీర్చి దిద్దారు. ఈ కళాశాల నుంచి వచ్చిన ఐదు బ్యాచ్‌ల విద్యార్థులు నేటికి విదేశాల్లో రాణిస్తున్నారు.దశల వారిగా అభివృద్ధి చెందిన కళాశాల కళాశాలలో అధ్యాపకుల రాజకీయ చట్రంలో నలిగి పోయింది. 2019 నాటికి ఖయిలా పడింది. చివరకు మూసివేయటానికి ప్రభుత్వం నిర్ణయించింది. సుమారు ఐదేళ్ళ పాటు ప్రతి నెల రూ.50లక్షల చొప్పున ఇక్కడ పని చేసిన సిబ్బందికి దేవస్థానం నుంచి సొమ్ములు చెల్లించారు.

**గెలిచినప్పటి నుంచి నారాలోకేష్ చెవిలో జోరిగలా . . .**

2014 ఎన్నికల్లో హోరాహోరి పోటీ సాగింది. ఈ పోటీలకు ముందు నారాలోకేష్ యువగళం యాత్రలో ఇక్కడ బస చేసినపుడు పలువురు ఇక్కడ స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల గురించి విన్నవించారు. వాస్తవ పరిస్థితిని పరిశీలించిన లోకేష్ విద్యావంతుడు కాబట్టి ఇక్కడి ప్రజల ఆర్థిక పరిస్థితిని అవగాహన చేసుకొని తాము అధికారంలోకి వస్తే తప్పక పునఃప్రారంభింపజేస్తామంటూ భరోసా ఇచ్చారు. ఎన్నికల తరువాత కూటమి ప్రభుత్వం వచ్చింది. శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి గెలిచిన తరువాత ప్రతి వారం విద్యాశాఖ మంత్రి అయిన నారాలోకేష్ చెవిలో 'స్కిట్' అంటూ గుర్తు చేయసాగారు. ఒక దశలో గతంలో తన తండ్రి హాయాంలో ప్రతిపాదించిన జేయన్‌టియులో విలీనం చేయటానికి ప్రతిపాదనను తెరమీదకు తెచ్చారు.కళాశాల మరమ్మత్తులకు దేవస్థానం సొమ్ములను కేటాయించుటకు ఒరెండు మూడేళ్ళుఆర్థికంగా దేవాదాయశాఖ భరించుటకు సిద్ధం అని ప్రభుత్వం దృష్టకి తెచ్చారు.




## లాసెట్ ఫలితాల విడుదల

### అన్ని విభాగాలలో మహిళలదే పైచేయి

### లాసెట్ లో తిరుపతి విద్యార్థికి 2వ ర్యాంక్

తిరుపతి విద్య జూన్ 19 ప్రభాతవార్త

పద్మావతి మహిళా యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 5వతేదీన రాష్ట్ర వ్యాప్తంగా 133 పరీక్షా కేంద్రాలలో నిర్వహించిన ఏపీలాసెట్ పరీక్షా ఫలితాలు గురువారం ఉన్నత విద్యామండలి ఛైర్మన్,లాసెట్ చైర్మన్, వీసీ ప్రొఫెసర్ ఉమ ఆన్లైన్లో విడుదల చేశారు. ఎల్‌ఎల్‌ఎం ప్రవేశ పరీక్షకు 2092మంది హాజరుకాగా 2076మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ఎల్‌ఎల్బీ 5ఏళ్ల కోర్సుకు 3867 మంది హాజరుకాగా 3659 మంది ఉత్తీర్ణులయ్యారు.ఎల్‌ఎల్బీ 3 ఏళ్ల కోర్సుకు 15,292మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకాగా 15,091మంది ఉత్తీర్ణులయ్యారు.దీంతో ఎల్‌ఎల్‌ఎమ్ ప్రవేశ పరీక్షలో 99.24శాతం,ఎల్‌ఎల్బీ 3,5ఏళ్ల కోర్సుకు 98.69శాతం,94.62శాతం ఉత్తీర్ణతగా నమోదైంది. ఈ ఏడాది సైతం లాసెట్లో మహిళలే పైచేయి సాధించారని చెప్పారు.

**తిరుపతి విద్యార్థికి రెండవ ర్యాంక్**



రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ఎల్ఎల్ బి 5ఏళ్ల కోర్సుకు జరిగిన ప్రవేశ పరీక్షలో తిరుపతి వైకుంఠపురానికి చెందిన సింగమల భావన 107 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంక్ సాధించింది.ఆమె తండ్రి ఈశ్వరయ్య తిరుపతి రైల్వే స్టేషన్లో లోకోపైలెట్ గా పనిచేస్తుండగా తల్లి సత్యవేడు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో హెడ్మాస్టర్ విధులు నిర్వహిస్తున్నారు. ఐఏఎస్ సాధించడమే తన లక్ష్యమని లాసెట్ లో రెండవ ర్యాంక్ రావడం సంతోషంగా ఉందని చెప్పారు.

## ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలుశిక్ష

### - రూ. 6లక్షల జరిమానా

### ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి తీర్పు వెల్లడి



తిరుపతి కార్పొరేషన్, జూన్ 19, ప్రభాతవార్త

ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షల జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి గురువారం తీర్పు నిచ్చారు. ఆర్ఎస్ఎస్టీఎఫ్ హెడ్ ఎల్. సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 74/2017 కేసులో ఒక ముద్దాయి అరెస్టయ్యాడు. ఇతను తమిళనాడుకు చెందిన పరమన్ అన్బు కాగా, ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ కరకంబాడీ ఫారెస్ట్ బీటు, కృష్ణాపురం సెక్షన్ తిరుపతిలో పట్టుబడ్డాడు. ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులో అతి విలువైన సహజ సంపద అయిన ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడమే కాకుండా, అడవిలోకి అక్రమ ప్రవేశం చేసిన నేరస్తులకు కూడా ఇది ఒక హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు అధికారులు తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని అభినందించారు.




## తిరుమలలో ఇక ఉచిత రవాణా !

### -నిర్ణీతఛార్జీతోనే ఉన్నచోటునుండే తిరుపతికి వెళ్ళొచ్చు

### -ఉచిత ఆర్టీసిబస్సుల ప్రారంభంలో అదనపు ఈఓ చౌదరి



తిరుమల,జూన్ 19ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమలకు చేరుకున్న భక్తులు ఉన్నచోటు నుండి ఎక్కడకు చేరుకోవాలన్నా ఆర్టీసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయం టిటిడి కల్పించింది. ఇందుకోసం అవసరమైన ఆర్టీసి బస్సులను ఆ సంస్థ అధికారులు సమకూర్చారు.ఈ విద్యుత్ ఆర్టీసి ఉచిత బస్సులను గురువారం తిరుమలలో టిటిడి అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఏపిఎస్ఆర్టీసి ఈఓ పైడి చంద్రశేఖర్, టిటిడి రవాణా జిఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈఓలోకనాథం, తిరుపతి జిల్లా ప్రజారవాణా అధికారి వెంకట్రావు, డిప్యూటీ సిటిఎం విశ్వనాథ్, డిప్యూటీ సిఎంఇ బాలాజీ, అలిపిరి డిపో మేనేజర్ శ్రీహరితో కలసి ప్రారంభించారు. ఆర్టీసి విద్యుత్ బస్సులను భక్తుల సౌకర్యార్థం కొండపై అవసరమైన గమ్యస్థానాలకు చేరేలా ఉచిత సర్వీసు అందుబాటులోకి తీసుకువచ్చారు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో ఈ ఆర్టీసి బస్సులను ఎక్కడం ద్వారా నేరుగా తిరుపతికి వెళ్ళేందుకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. ఏప్రాంతంలో బస్సు ఎక్కినా తిరుమల నుండి తిరుపతికి మాత్రమే ఛార్జీలు ఉంటాయన్నారు.



## డా॥ రామయ్యకు దేశం నేతల ఘన నివాళులు

కుప్పం, జూన్ 19 ప్రభాతవార్త



ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్ తండ్రి డా॥ కంచర్ల రామయ్యకు కుప్పంలో తెదేపా నేతలు ఘన నివాళులు అర్పించారు. గురువారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో డా॥ రామయ్య చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ డా॥ రామయ్య అకాల మృతి తీరనిలోటు అని పేర్కొన్నారు. విద్యావేత్తగా ఆయన కందుకూరు ప్రాంతంలో పేద విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, కార్పొరేషన్ డైరెక్టర్లు రాజగోపాల్, వేణుగోపాల్, నేతలు డా॥ వెంకటేష్, ఆర్ముగం, కన్నన్, రామచంద్ర, హర్ష ధర్మతేజ, సతీష్, నరేష్, నబీఉల్లా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

– నిర్వాహకురాలితో పాటు 6 మంది అరెస్టు

**చిత్తూరు, జూన్ 19 ప్రభాతవార్త:** చిత్తూరు రామ్‌నగర్‌కాలనీ బ్రిక్స్‌లోని ఓ వ్యభిచార గృహంపై వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వ్యభిచార గృహం నిర్వహిస్తున్న సుమతి అనే మహిళతో పాటు మరో ఇద్దరు మహిళలు, నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. చిత్తూరు రామ్‌నగర్‌కాలనీ బ్రిక్స్‌లోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ డిఎస్పీ సాయినాథ్ ప్రొసిడింగ్స్ మేరకు పోలీసులతో గురువారం వ్యభిచార గృహంపై దాడులు నిర్వహించారు. ఈ సమయంలో సుమతి అనే మహిళతో పాటు అక్కడ మరో ఇద్దరు మహిళలు, నలుగురు విటులు వుండటంతో వారిని పట్టుకుని పోలీసులు అరెస్టు చేశారు.

**పేకాట స్థావరంపై దాడి**

చిత్తూరు సంతపేటలోని ఓ ఇంట్లో పేకాట నిర్వహిస్తుండటంతో పోలీసులు దాడి చేసి 11 మంది పేకాట రాయుళ్ళను అరెస్టు చేసి 40 వేల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు. సంతపేటలో పేకాట నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో ఆ మేరకు అక్కడికి వెళ్ళి తనిఖీలు నిర్వహించి ఆ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు స్పష్టం కావడంతో పోలీసులు దాడులు చేశారు. ఈ పేకాట నిర్వహణను శ్యామ్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడని, ఇతనిని త్వరలో అరెస్టు చేస్తామని వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ సుగుణ సిబ్బంది బాబు, రాజేష్, వెంకటేష్, మునస్వామి, నరేష్, బాలాజీ, జనార్ధన్, హాజీ, రవి తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు హైరోడ్డు విస్తరణలో కీలక అడుగు

– కట్టమంచి వద్ద వంద అడుగుల స్థలం సేకరణ



**చిత్తూరు, జూన్ 19 ప్రభాతవార్త:** చిత్తూరు నగర పరిధిలో హైరోడ్డు విస్తరణ పనుల్లో గురువారం కీలక ముందడుగు పడింది. ప్రైవేటు యాజమానులను అంగీకరింపజేసి వంద అడుగుల మేరకు రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలంను అధికారులు సేకరించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడుల మార్గనిర్దేశంలో కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశాల మేరకు నగరంలోని ప్రధానమైన హైరోడ్డు విస్తరణ పనులు గత కొన్ని రోజులుగా వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఎసిపి నాగేంద్ర ఆధ్వర్యంలో ప్రణాళిక విభాగం అధికారులు గురువారం కట్టమంచి ప్రాంతంలో వెంకుశ కళ్యాణ మండపం వద్ద వంద అడుగులు రోడ్డు వెడల్పు చేయడానికి అవసరమైన స్థలంను సుమారు 200 అడుగుల పొడవుతో సేకరించడం జరిగింది. ఈ మేరకు ప్రహరీగోడను తొలగించి రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలంను సేకరించారు. ఇక్కడే మరికొన్ని ప్రైవేటు స్థలాల నుండి రోడ్డు విస్తరణకు అవసరమైన స్థలంను సేకరించి సదరు స్థలంలోని నిర్మాణాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో టిబిపిఓలు, ప్రణాళిక సిబ్బది తదితరులు పాల్గొన్నారు.

## ఆదవరంలో యోగా దినోత్సవం

శ్రీకాళహస్తి,జూన్ 19 ప్రభాతవార్త

జిడ్డు కృష్ణమూర్తి అధ్యయన కేంద్ర సారథ్యంలో ఈ నెల 21 న మారుమూల కొండల్లో వెలసిన కొండల్లో ఆదవరం లో యోగ సాదన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు అధ్యయన కేంద్రం నిర్వాహకులు బాలిశెట్టి చిరంజీవులు గురువారం వివరించారు. ఒంగోలుకు చెందిన యోగా అధ్యాపకురాలు చంద్రశేఖర్ సారథ్యం లో యోగాభ్యాసనం వల్ల కలిగే ప్రయోజనాలు,మానసిక ప్రశాంత,యోగా ఆవశ్యకతల గురించి చైతన్యం చేసారని చిరంజీవులు తెలిపారు.గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

## ప్రజా ఫిర్యాదులను అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించిన కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, జూన్ 19, ప్రభాతవార్త



ప్రజల నుండి అందిన పిర్యాదులను ఆయా విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను కమిషనర్ గురువారం కొర్లగుంట, సాయి విష్ణు లేఔట్, ఇఎస్‌ఐ హాస్పిటల్, తిరుమల బైపాస్ రోడ్డులోని ప్రాంతాలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్బంగా కమిషనర్ మాట్లాడుతూ నిబంధనలను అతిక్రమించి ఎవరైనా నిర్మాణాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాయి విష్ణు లేఔట్‌లో నూతనంగా నిర్మించిన అపార్ట్మెంట్‌లో అన్ని నిబంధనల మేరకు ఉన్నాయా అని మరో మారు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈ ఎస్ ఐ హాస్పిటల్ వద్ద మురుగు కాలువలోని చెత్తను వెంటనే తొలగించి, పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయా విభాగాల అధికారులు అందరూ వారి వారి పరిధిలోని ప్రజా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని అన్నారు. కమిషనర్ వెంట ఏసిపి మూర్తి, సర్వేయర్ కోటేశ్వర రావు, ప్లానింగ్ సిబ్బంది ఉన్నారు.

## ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

చౌడేపల్లి, జూన్ 19 ప్రభాతవార్త



స్థానిక ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఎంఎన్ చెన్నై ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో 40మంది పాల్గొనగా 12మంది కంటి శస్త్రచికిత్సకు ఎంపికయినట్లు వైద్యాధికారి పవన్‌కుమార్ తెలిపారు. కంటి వైద్య నిపుణులు రహంతుల్లాఖాన్, ఎంఎన్ ఆసుపత్రి, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## జాతి నేతల విగ్రహాల ఏర్పాటుకు స్థలాన్ని చూపండి : వెంకట్‌యాదవ్

చౌడేపల్లి, జూన్ 19 ప్రభాతవార్త



జాతినేతల విగ్రహాల ఏర్పాటుకు స్థలాన్ని చూపాలని జిల్లా ఓబీసీ విద్యార్థి విభాగ అధ్యక్షుడు వెంకటయాదవ్ తహశీల్దార్ పార్వతిని కోరారు. చౌడేపల్లి, పెద్దూరు, కొలింపల్లి ప్రధాన కూడళ్ళల్లో మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులు, డాక్టర్ అంబేద్కర్ విగ్రహాల ఏర్పాటు కొరకు స్థలాలను కేటాయించాలని వినతి పత్రమందించారు. ఎస్టీ, ఎస్సీ, బిసి నాయకులు సురేష్, కార్తీక్‌లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్‌కు పితృవియోగం

కుప్పం, జూన్ 19 ప్రభాతవార్త



ప్రభుత్వ విప్, కుప్పం తెదేపా సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ తండ్రి, విద్యావేత్త డా॥ కంచర్ల రామయ్య శివైక్యం చెందారు. ఆయన గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ప్రకాశం జిల్లాలో విలేకరిగా ఆయన తొలుత పనిచేశారు. అనంతరం దివంగత సిఎం ఎన్టీఆర్ ప్రోత్సాహంతో రాజకీయాల్లో అడుగుపెట్టారు. డా॥రామయ్య ప్రకాశం జిల్లా కందుకూరులో ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజ్ స్థాపించి వేలాదిమంది గ్రామీణ విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందించారు. కందుకూరులో జరిగే సామాజిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు సాయం అందించేవారు. రామయ్యకు భార్య, ఇద్దరు కుమారులు కలరు. డా॥ రామయ్య రాష్ట్ర రత్న, ఎడ్యుకేషనల్ లీడర్‌షిప్ , లెర్నింగ్ ఇన్నోవేషన్ అవార్డు అందుకున్నారు. అలాగే కంచర్ల ఫౌండేషన్ స్థాపించి సేవా కార్యక్రమాలు, రక్తదాన, వైద్య శిబిరాలు, విరాళాలు అందించారు. డా॥ కంచర్ల రామయ్య అంత్యక్రియలను శనివారం ఉదయం 10గంటలకు కందుకూరులో నిర్వహించనున్నారు.

## రెండో విడత వేరుసెనగ విత్తనాల పంపిణీ

కుప్పంరూరల్, జూన్ 19 ప్రభాతవార్త



ప్రభుత్వం తరపున రైతులకు రాయతీతో రెండో విడత వేరుసెనగ విత్తనాలను గురువారం కుప్పం వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఎఓ ఫయాజ్‌బాషా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి మొదటి విడతగా 849క్వింటాళ్లు, రెండో విడతలో 210 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులోవచ్చాయన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలను ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. రైతులు కూడా విత్తనాలను సాగు చేయాలన్నారు. లేకుంటే వచ్చే ఏడాదికి విత్తనాలు తగ్గే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో విఎఎలు పాల్గొన్నారు.

## ఏడోమైలులో ఆర్ఎంపి క్లినిక్ సీజ్

శాంతిపురం, జూన్ 19 ప్రభాతవార్త



మండలంలోని ఏడోమైలు గ్రామంలో ఎలాంటి సర్టిఫికెట్లు లేకుండా వైద్య సేవలు అందిస్తున్న సింగారవేలు అనే వ్యక్తి నడుపుతున్న క్లినిక్‌ను డిఎంహెచ్‌ఓ ఆదేశాల మేరకు రాళ్లబూదుగూరు పిహెచ్‌సి డా॥ శివకుమార్ సీజ్ చేశారు. గతకొంతకాలంగా సింగారవేలు ఆర్ఎంపి క్లినిక్ పెట్టుకుని ఎలాంటి సర్టిఫికెట్లు లేకుండా నిర్వహిస్తున్నాడు. దీంతో కొంతమంది డిఎంహెచ్ఒకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు క్లినిక్‌ను సీజ్ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళల ధర్నా

కుప్పం, జూన్ 19 ప్రభాతవార్త



కుప్పం పోలీస్ స్టేషన్ ఎదుట గురువారం జరుగు గ్రామంకు చెందిన కొందరు మహిళలు ధర్నా చేశారు. గ్రామంలో బుధవారం ఇరువర్గాల వారు ఘర్షణ పడ్డారు. ఈనేపథ్యంలో ఇరువర్గాల వారు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఓ వర్గంకు చెందిన మహిళలు తాము పేర్కొన్న కొందరిపై పోలీసులు కేసు నమోదు చేయలేదని పేర్కొంటూతమకున్యాయంచేయాలనిధర్నాచేశారు.రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ మహిళలకు నచ్చజెప్పారు.

## బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

**విజయపురం, జూన్ 19 ప్రభాతవార్త:** బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలని శ్రీహరిపురం ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకమరాజు పేర్కొన్నారు. గురువారం శ్రీహరిపురం యానాది కాలనీ లో ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను గుర్తించి పాఠశాలలో నమోదు చేశారు. పాఠశాలలో చేరిన వెంటనే విద్యార్థులకు సర్వేపల్లి విద్యామిత్ర కిట్‌ను ఇవ్వనున్నట్లు అలాగే 1వ తరగతిలో నమోదు అయిన విద్యార్థులకు జూలైలో తల్లికి వందనం పథకం వర్తిస్తుందని ప్రధానోపాధ్యాయులు వెంకమరాజు పేర్కొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## యోగాంధ్ర విజయవంతం చేయండి

పులిచెర్ల, జూన్ 19, ప్రభాతవార్త



పులిచెర్ల మండలంలో ఈనెల 21వ తేదీ శనివారం నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రాజశేఖర్ బాబు అన్నారు. పులిచెర్ల ఎంపిడిఓ కార్యాలయంలో శనివారం యోగాంధ్రపై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని యోగాతో కలిగే లాభాల గురించి వివరించి ప్రజలను భాగస్వాములు చేయాలని అన్నారు. ఎంఈఓలు సిద్ధరామయ్య పోకల తాతయ్య, ఏపీవో సౌభాగ్యవతి, ఏపిఎం చంద్రమోహన్, హెచ్ఎంలు లోకనాథరెడ్డి, లక్ష్మి, దేవమ్మ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ప్రపంచం మెచ్చిన నేత చంద్రబాబు

పుంగనూరు, జూన్ 19, ప్రభాతవార్త



ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రపంచానికి ట్రేడ్ మార్క్‌గా నిలిచారని దేశం ఇన్చార్జి చల్లా బాబు ప్రశంసించారు. స్వయం సహాయక సంఘాలకు ట్యాబ్‌ల పంపిణీ గురువారం మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా మహిళలను స్వయం ఉపాధి వ్యాపార రంగాల్లో తీసుకోరావడమే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమన్నారు. అమరావతి రాజధానిగా ఏకంగా ఒక నగరాన్నే నిర్మించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న చొరవ అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి అధికారులు పాల్గొన్నారు. మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## రామరాజ్యం మోడీతోనే సాధ్యం

పుంగనూరు, జూన్ 19, ప్రభాతవార్త



భారత ప్రజలను కాంగ్రెస్ పార్టీ 60 ఏళ్లుగా మోసం చేసిందని, రామ రాజ్య పాలన మోడీతోనే సాధ్యమని పట్టణ బీజేపీ అధ్యక్షులు యం. జగదీష్ రాజు అన్నారు. నరేంద్ర మోదీ 11 ఏళ్ల పాలనలో జరిగిన అభివృద్ధికి సంబంధించి కరపత్రాలను ప్రతి ఒక్కరికీ ఇస్తూ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వికాసిత్ భారత్ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువ మోర్చా ఉపాధ్యక్షులు మదాస్ లోకేష్ జిల్లా ఉపాధ్యక్షురాలు మల్లికారాణి, పెద్దమటం బాబు, చౌడేపల్లి మండల అధ్యక్షులు మనోహర్, నానా బాల కుమార్, వెంకటరెడ్డి, నాగరాజ, మంజు, ఆదినారాయణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మామిడి రైతులకు భరోసా ఇచ్చిన తాసిల్దార్ రమేష్ బాబు

పూతలపట్టు, జూన్ 19, ప్రభాతవార్త



మామిడి రైతులు ఆదుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వంతో తాపూరి రకం మామిడికాయలు కేజీకి నాలుగు రూపాయలు చెల్లిస్తుందని పూతలపట్టు తాసిల్దార్ రమేష్ బాబు తెలిపారు. గురువారం మండలంలో గొడుగు చింత పంచాయతీ శ్రీ రాముల వారి గుడి దగ్గర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ రోజురోజుకు తగ్గుతున్న విషయంను ప్రభుత్వం గుర్తించి రైతులను ఆదుకోవాల నే దశగా ముందుకు వెళుతుందన్నారు. రాంపులు వద్దకు అమ్మకాలు జరిపే రైతులకు సైతం ప్రభుత్వ గిట్టుబాటు ధర అందిస్తుందన్నారు. రాంపులలో వద్దకు కాయలు తీసుకొని వెళ్లి రైతులు ఆధార కార్డు వన్ బి పాస్ బుక్ బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ కాపీలను అక్కడే ఉన్న అధికారులకు అందజేయాలన్నారు అలాగే ముఖ్యంగా పరిపక్వం కు వచ్చిన కాయలు మాత్రమే పోయాలని రైతులకు సూచించారు పల్స్ ఫ్యాక్టరీ యజమానులు కేజీ పై 8 రూపాయలు చెల్లిస్తుందని మిగిలిన నాలుగు రూపాయలు ప్రభుత్వం రైతుకు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి సర్పంచి మోహనమ్మ, వీఆర్వో మంజునాథ్, టిడిపి నాయకులు రైతులు పాల్గొన్నారు.

## బాధలు వింటూ భరోసా కల్పిస్తూ...!

-నెరవేర్చిన సొంతింటి కల

చౌడేపల్లి, జూన్ 19 ప్రభాతవార్త



కష్టకాలంలో ప్రజా హృదయాల్లో మెదలాడే వ్యక్తే నాయకుడవుతాడు... జనం బాధలు తనవిగా అనుకొని వెంటనే నివృత్తి చేసేవాడు వారి గుండెల్లో చిరకాలం నిలచిపోతాడు... మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) ఆకోవెకు చెందిన వ్యక్తిగా ప్రసిద్ధికెక్కాడు. జనం బాధలు వింటూ వారందరికీ భరోసా కల్పిస్తూ దూసుకెళ్తున్నాడు. తానెక్కడుంటే అక్కడ అందరూ బాగుండాలనే తత్వం ఆయన సొంతం. మండలంలోని 29.ఎ.చింతమాకులపల్లిలో గల గంగులప్ప కుటుంబానికి గువ్వల రమేష్‌రెడ్డి చేసిన సాయం ఒక మచ్చుతునక మాత్రమే. గురువారం ఆయన బయపల్లికి ఓ కార్యక్రమ నిమిత్తం వెళ్ళాడు. అక్కడ గంగులప్ప కుమారుడు ప్రదీప్, కోడలు హేమలు పూరి గుడిసెలో నివశిస్తున్నారు. ఊరంతా పక్కాఇల్లు వుండి ఒక్క ఆ కుటుంబం మాత్రమే గుడిసెలో జీవిస్తున్నారన్న విషయాన్ని గుర్తించాడు. అదే విధంగా తమ సమస్యను వారు గువ్వలకు తెలిపారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన అధికారులతో సంప్రదించి పక్కాగృహం మంజూరు అయ్యేలా చర్యలు తీసుకొన్నాడు. దీంతో 2దశాబ్దాలుగా నెరవేరని సొంతింటి కల నెరవేరిందని ఆ కుటుంబ సభ్యులు గువ్వల రమేష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# తోతాపురికి మద్దతు ధర చెల్లించకుంటే చర్యలు

– కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరిక

**చిత్తూరు, జూన్ 19 ప్రభాతవార్త:**



తోతాపురి మామిడికి మద్దతు ధర కంటే తక్కువ చెల్లించిన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సుమిత్‌కుమార్ హెచ్చరించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం జిడినెల్లూరులోని జైన్ ఫ్యాక్టరీ, గుడిపాల మండలంలోని ఆర్ఎంఎం ఫ్యాక్టరీని సందర్శించి మామిడి కాయల కొనుగోలుపై పరిశ్రమల యాజమాన్యాలు, మామిడి రైతులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మేరకు తోతాపురి మామిడి కాయలకు మద్దతు ధర చెల్లించాలని, ట్రేడర్లు, రైతులను ఇబ్బందికి గురి చేయవద్దని పేర్కొన్నారు. మద్దతు ధర కంటే తక్కువ ధర చెల్లిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే గుజ్జు పరిశ్రమలకు మామిడికాయలు తీసుకువచ్చే రైతులకు కనీస సౌకర్యాలైన తాగునీరు, భోజనం వసతి కల్పించాలని తహసిల్దార్లు, ఎంపిడిఓలను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఈ సీజన్‌లో మామిడి ఉత్పత్తి కంటే ఎక్కువ వుండటంతో ప్యాకింగ్ మెటీరియల్ సమకూర్చుకుని ప్రాసెసింగ్ యూనిట్లు కెపాసిటీని పెంచుకోవాలని సూచించారు. అలాగే మామిడి కొనుగోలు చేసిన యామమాన్యం సకాలంలో రైతులకు చెల్లించాల్సి న డబ్బులను అందించాలన్నారు. ధరల విషయంలో ప్రభుత్వ ఉత్తర్వులు అమలు అయ్యేలా కచ్చితంగా చూడాలన్నారు. అలాగే సీరియల్ సంఖ్య ప్రకారమే లోడ్ వున్న రైతులకు అవకాశం కల్పించడం జరుగుతుందని, టోకెన్ పద్దతి కచ్చితంగా అమలు చేస్తున్నామన్నారు. రైతులు ఎక్కడా నష్టపోకుండా చివరి కేజీ వరకు మామిడిని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా వుందని, మండలాల్లో తహసిల్దార్లు, ఉద్యానశాఖ అధికారులు మామిడి రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## తేదేపా నాయకుడు ఇంట చల్లాబాబు

చౌడేపల్లి, జూన్ 19 ప్రభాతవార్త



తేదేపా మండల ఉపాధ్యక్షుడు ఆవుల రామచం ద్రయ్య, ఇంట దశదిన కార్యక్రమానికి పుంగనూరు నియోజకవర్గ తేదేపా ఇన్‌ఛార్జీ చల్లా రామచం ద్రారెడ్డి, మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డిలు హాజరయ్యారు. రామచంద్రయ్య సతీమణి దివంగత మునిరత్నమ్మ చిత్ర పటానికి పూల మాలలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేసారు. శ్రీధర్‌రాజు(గిరి), పంజానిపల్లి బాబునాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, అర్జున్, ముని, అనిల్, గిరినాయుడు, పరమేష్, కళ్యాణ్, మునివెంకటప్ప, తేదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెడ్‌బుక్ రాజ్యాంగం వద్దు .. అంబేద్కర్ రాజ్యాంగమే ముద్దు

### చెవిరెడ్డి అరెస్ట్ అక్రమం : మోహిత్‌పై కేసు అన్యాయం, వైసిపి మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి

**చంద్రగిరి, జూన్ 19 ప్రభాతవార్త:**




రెడ్‌బుక్ రాజ్యాంగం వద్దు, అంబేద్కర్ రాజ్యాంగమే ముద్దు అంటూ వైసిపి శ్రేణులు కదంతొక్కారు. వైసిపి మాజీ ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అరెస్ట్ అక్రమం అంటూ గురువారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద నినదించారు. తమ అభిమాన నాయకుడు చెవిరెడ్డి అక్రమ అరెస్ట్‌కు వ్యతిరేకంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్ రెడ్డి నాయకత్వంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశమంతా అంబేద్కర్ రాజ్యాంగం అమలులో వుండగా ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తున్నట్లు దుయ్యబట్టారు. చెవిరెడ్డిపై ఏడాది కాలంగా ఎటువంటి కేసులు లేకపోవడంపై జీర్ణించుకోలేని ప్రభుత్వం మద్యం కుంభకోణంలో ఏ38 ముద్దాయిగా చేర్చడం పోలీసులకు తగదన్నారు. తుడా మాజీ ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని సైతం టార్గెట్ చేసిన ప్రభుత్వం అన్యాయంగా మద్యం కుంభకోణం కేసులో ఏ39 ముద్దాయిగా చేర్చడం దుర్మార్గమన్నారు. అక్రమ అరెస్ట్‌లకు పాల్పడుతున్న అధికారులను హెచ్చరిస్తూ ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయనీ, అధికారం ఏ ఒక్క పార్టీకీ శాశ్వతం కాదన్నారు. అదేవిధంగా చెవిరెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి మాట్లాడుతూ ఏడాది కాలంలోనే ప్రజల్లో చెవిరెడ్డి కుటుంబం పట్ల పెరుగుతున్న ఆధరణను తట్టుకోలేని ప్రభుత్వం అక్రమ కేసులతో భయపెట్టాలని చూస్తున్నట్లు దుయ్యబట్టారు. కుంభకోణాలపై కనీస అవగాహన చెందని తన కుమారుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డిపై మద్యం కుంభకోణం కేసు నమోదు చేయడం మా కుటుంబం పట్ల ప్రభుత్వం కక్ష సాధింపుకు పాల్పడుతున్నట్లు అర్థమవుతుందన్నారు. ప్రజలు గమనిస్తున్నారని, అక్రమ అరెస్ట్‌లు చెవిరెడ్డి కుటుంబాన్ని నిలువరించలేవని తేల్చిచెప్పారు.



## రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

రేణిగుంట జూన్ 19 ప్రభాతవార్త

రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలో గురువారం రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రేణిగుంట రైల్వే పోలీసులు తెలిపారు. చనిపోయిన వ్యక్తి కాఫీ పొడి రంగు ప్యాంటు, ఎర్ర రంగు నలుపు రంగు బార్డర్ కలిగిన బనీను, తెలుపుపై గీరలు షర్టు ధరించి ఉన్నాడు. ఇంతకుమించిన ఆధారాలు చనిపోయిన వ్యక్తి దగ్గర లభించలేదు. మృతుని ఆచూకీ తెలిసినవారు రేణిగుంట రైల్వే పోలీస్ స్టేషన్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రామకృష్ణ మొబైల్ నంబర్ 9542166850 సమాచారం ఇవ్వవలసిందిగా కోరారు

## ఐఐటిలో దరఖాస్తులకు ఆహ్వానం

శ్రీకాళహస్తి,జూన్ 19 ప్రభాతవార్త

ఏర్పేడు మండల కేంద్రంలో ఉన్న తిరుపతి ఐఐటి,కేంద్రీయ విద్యాలయంలో పలు తరగతుల్లో ఉన్న ఖాళీ సీట్లను భర్తీ చేయుటకు దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ రమేష్ బజ్జూరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన విద్యార్థుల తల్లిదండ్రుల దరఖాస్తు చేసుకోవటానికి ఈ నెల 21 నుంచి 25 వరకు ఉదయం10గంటల నుంచిసాయంత్రం 4 వరకు నేరుగా సంప్రదించవచ్చునని వివరించారు. ఖాళీల వివరాలను తెలుపుతూ 1వ తరగతిలో ఒక్కసీటు ఎస్‌టికి మరో సీటు విద్యార్థినికి 2వ తరగతిలో ఒక సీటు ఎస్‌టి, 3వ తరగతిలో ఎస్‌టి, 4లో 26ఖాళీలు ఉన్నట్లు వివరించారు. 5వ తరగతిలో ఒక ఎస్‌సి,ఒకఎస్‌టిలుఖాళీలున్నాయన్నారు.తల్లిదండ్రులు తల్లిదండ్రులు గుర్తించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.



## తిరుమలేశుని సేవలో గణపతిసచ్చిదానందస్వామి

తిరుమల,జూన్ 19ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం ఉదయం దత్తపీఠం మైసూర్ పీఠాధిపతి గణపతిసచ్చిదానందస్వామి దర్శించుకున్నారు. ఆలయం వద్ద టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం,ఆలయ పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి ,అర్చకులు స్వాగతం పలికారు.

## వాడ వాడల్లో సామాజిక కార్యక్రమాలు: అన్నదానాలు

### ముందస్తు కోలా ఆనంద్ జన్మదిన సంబరాలు



తొట్టంబేడు/శ్రీకాళహస్తి రూరల్, జూన్ 19 ప్రభాతవార్త

రాష్ట్ర బిజెపి కార్యదర్శి, శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మెన్ కోలా ఆనంద్‌కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం తొట్టంబేడు, శ్రీకాళహస్తి మండలాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. సామాజిక కార్యక్రమాలు, అన్నదానాలు నిర్వహిస్తున్నారు. తొట్టంబేడు మండలంలోని బసవయ్యపాళెం గ్రామంలో భారీ ఎత్తున చొక్కాని రామమూర్తి, బిందురాయల్ సారథ్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించిన వారు కోలా ఆనంద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై పాఠశాలలలో విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణి చేసారు. కాగా శ్రీకాళహస్తి మండలం వెల్లంపాడులో అబ్బూరు పుల్లమనాయుడు సారథ్యంలో కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు విద్యాసామగ్రితో పాటు మిఠాయిలు పంపిణి చేసారు. ఏర్పేడు మండల కేంద్రంలోని కూడలిలో మండల పార్టీ అధ్యక్షుడు నరేష్ కృష్ణయాదవ్, సహకారంతో అన్నదానాలు జరిపారు. శ్రీకాళహస్తి ముత్తరాశిపాళెంలో వీరాస్వామి ఆచారి సారథ్యంలో అన్నదానం నిర్వహించారు. తుఫాన్ సెంటర్‌లో సీనియర్ బిజెపి నాయకుడు గరికపాటి రమేష్ సారథ్యంలో మహిళలకు చీరలు, గాజులు, మిఠాయిలు పంపిణి చేసారు. ఈ కార్యక్రమాల్లో అసెంబ్లీ కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బాలాజి జిల్లా అధ్యక్షులు కొండేటి గోపాల్, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్‌వి రమణ వేడా ఒకృష్ణయ్య, భగీర్తి, పవెంకటేష్, కూనాటి నాగరాజు, ధర్మయ్య యాదవ్, పెద్దపాలెం రవి ఆచారి, రాఘవనాయుడు, చొక్కాని రవిచంద్ర, కన్నా వెంకటేశ్వర్లు, తిరుపాల్‌నాయుడు, రవి రాయల్, విజయ్, తులసి రామ్ వినోద్, సురేస్, వినోద్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

***విశాలక్షి జన్మదిన వేడుకలు:***

శ్రీకాళహస్తికి చెందిన రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ సతీమణి కోలా విశాలాక్షి జన్మదిన వేడుకలును సీనియర్ నాయకులు గరికపాటి రమేష్‌బాబు సారథ్యంలో భారీ ఎత్తున కెక్ కట్ చేసారు. కోలా ఆనంద్‌కుమార్ సారథ్యంలో జన్మదిన వేడుకల కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష రామకృష్ణ, పుణ్యం డిల్లి కుమార్, మద్దు వాసు యాదవ్, తుపాకుల చిన్నబ్బ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లింలకు మేనమామ సాంగ్యం అందించిన మాజీ ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి, జూన్ 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని మైనారిటి ముస్లింలకు మళ్ళీ మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి మేనమామసాంగ్యాన్ని ప్రారంభించారు. గురు వారం జరిగిన ఓ వివాహావేడుకల్లో ఆయన కొత్త వివాహ జంటకు గృహోపకరణాలతో పాటు మంచం, పరుపు, బీరువాలను అందించి ఆశీర్వదిం చారు. ఈ కార్యక్రమాల్లో మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, మైనారిటి నాయకుడు పఠాన్ ఫరీద్‌ఖాన్ గోరా, గౌస్ బాషా, ఫజిల్, అస్లం, సురేష్, మున్నారాయల్, కిరణ్‌కుమార్, రామచంద్ర, పెరుమాళ్ చౌదరిలు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 19 ప్రభాతవార్త



రాష్ట్రంలో ఏమూల సామాన్యుడు నిరుపేద ఆపద అంటే నేనున్నానంటూ ఆదుకునే మానవతా వాది మన సిఎం నారాచంద్రబాబునాయుడు అని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం ఊరందూరు గ్రామంలోని తన కార్యాల యంలో నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసారు. నేడు వైద్యం సామాన్యులకు అందుబాటులో లేని విధంగా కార్పొరేట్ వైద్యశాలల్లో ఉందన్నారు. అనారోగ్యం చేస్తే రూ.లక్షల్లో చేతిలో పెట్టుకోవాల్సి వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు. తాను అధికారం చేపట్టిన ఏడాదిలో ఐదారుసార్లు నిరుపేదలకు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధి నుంచి ఆర్థిక సహాయం అందించామని సుధీర్‌రెడ్డి వివరించారు. ఎవరు ఏ ఆపదలో ఉన్నా సంకోచించక తననుసంప్రదించాలని సూచించారు. కుటుంబం పెద్ద కొడుకుగా ఆదుకొనుటకు ముఖ్యమంత్రి సిద్దంగా ఉన్నారన్నారు. ఆర్థికంగా దెబ్బతిన్న వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ నేపధ్యంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన వారికి రూ. 24,62,489ల విలువ కల్గిన సిఎం రిలీఫ్‌ఫండ్‌చెక్కులను బాధితులకుఅ ందించారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ నాయుడు శ్రీకాళహస్తి రూరల్ అధ్యక్షుడు అంక్షితల కృష్ణయాదవ్, తొట్టంబేడు మండలాధ్యక్షులు మునిరాజానాయుడు, రూరల్, పట్టణ అధ్యక్షులు చంద్రారెడ్డి, బాషా, ఏర్పేడు మండలాధ్యక్షుడుగా పేరం నాగరాజు నాయుడు, బత్తిరెడ్డి, కామేష్‌యాదవ్ పాల్గొన్నారు.

## పాగాలి నాయకునికి పరామర్శ:

శ్రీకాళహస్తిరూరల్, జూన్ 19 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం పాగాలి గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుడు బాలకృష్ణారెడ్డి అస్వస్థతకు గురి కావటంతో ఆయన్ను తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. పార్టీ కోసం పాటు పడిన పాగాలి బూత్‌లో అధిక ఓట్లు సాధనలో కృషి చేసిన బాలకృష్ణ అస్వస్థత విషయం తెలుసుకున్న ఎంఎల్ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి ఆయన సతీమణి బొజ్జల రిషితారెడ్డిలు ఆయన్ను పలకరించారు. అధైర్యపడవద్దు నేనున్నానని భరోసా ఇచ్చారు.

## అంధుల అవసరాలకు చేయూత

తిరుపతి(రవాణ), జూన్ 19ప్రభాతవార్త



అంధులకు చేయూతనందిం చేందుకు జగత్ గురుసే వాసమితి గుడి-బడి తిరుపతి ముందుకు వచ్చింది గురూవారం సాయంత్రం స్థానిక శివజ్యోతినగర్‌లోని అంధుల శరనణాలయంలో చెక్కతలుపులు శిథిలావ స్థలకు చేరుకున్నాయి. అంధుల అభ్యర్థన మేరకు సేవాసమితి సభ్యులు 40వేల రూఆయలు కొత్త ఐర్‌తలుపులు అమర్చారు. అంధులకు ఎలాంటి సహ కారం కావాలన్నా తాము అందిస్తామని జగత్ గురుసేవాసమితి అధ్యక్షుడు మోహన్‌రామిరెడ్డి, ఉపాధ్య క్షుడు గోవిందరెడ్డి, కార్యదర్శి విశ్వనాథ్ ,సభ్యులు సందీప్, చంద్ర, శశి, బిజెపి నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, లోకేశ్, భాస్కర్‌రెడ్డి, మునేశ్వర రరెడ్డి పాల్గొన్నారు.

## ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి విద్య, జూన్ 19 ప్రభాతవార్త ః

ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ న్యాక్ అలిపిరి రోడ్డు తిరుపతి నందు ఉచితంగా శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు న్యాక్ శిక్షణా కేంద్ర ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున అసిస్టెంట్ ఎలక్ట్రిషన్ కోర్సుపైన ఈ నెల 25వ తేది నుంచి మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, వసతి సదుపాయం ఇచ్చి శిక్షణా అనంతరం ప్రభుత్వ గుర్తింపు సర్టిఫికెట్ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. కనీసం పదవ తరగతి పాస్/ఫెయిల్ అయి, 15-45 సంవత్సరాల వయస్సు ఉన్న ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారం కోసం నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ న్యాక్ శిక్షణా కేంద్రం, అలిపిరి రోడ్డు, తిరుపతి అదనపు సమాచారం కోసం 9701440274,9703437472లను సంప్రదించాలన్నారు.

## పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారిగా మహేశ్వరరావు బాధ్యతలు



పుత్తూరు రూరల్, జూన్ 19 ప్రభాతవార్త:

పుత్తూరు ఉప విద్యాశాఖ అధికారిగా మహేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఉప విద్యాశాఖ అధికారులు శుభాకాంక్షలు తెలియ జేశారు. ఆయనను శాలువలతో సత్కరించారు.

## మామిడి రైతులు కాయ పక్వానికి వచ్చిన తరువాతే కోయాలి

పుత్తూరు రూరల్, జూన్ 19 ప్రభాతవార్త:

మామిడి రైతులు కాయ పూర్తిగా పక్వానికి వచ్చిన తరువాతే కోయాలని ఉద్యాన అధికారి వెంకట సౌజన్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి మాట్లాడుతూ రైతులు ఆందోలన చెందవద్దని చివరి మామిడి కాయ వరకు ప్రభుత్వం కిలో 4 రూపాయలు చెల్లిస్తుందని, మామిడి కాయల లోడ్‌తో పాటు రైతుకు సంబంధించిన ఆధార్‌కార్డు, వన్‌బీ, బ్యాంకు పాసు పుస్తకం జిరాక్స్ కాపీలను అక్కడ ఉన్న సిబ్బందికి అందజేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. రాంపులు, మండీలు, కలెక్షన్స్ సెంటర్ల వద్ద కూడా మీకు సంబంధించిన పూర్తి వివరాలను ఒక కాపీ అక్కడ ఉన్న సిబ్బందికి అందజేయాలన్నారు. గుజ్జు పరిశ్రమల సామర్థ్యం మేర కొనుగోలు చేయడం జరుగుతుందని, రోజువారిగా ఈ వివరాలను తెలుసుకుని కోయాలని మామిడి రైతులను కోరారు.

## యోగా పోటీలలో సత్తాచాటిన ఎస్ఎస్ యూ విద్యార్థి

తిరుపతి విద్య, జూన్ 19 ప్రభాత వార్త



రాష్ట్రంలోని ఇబ్రహీంపట్నం వేదికగా ఈనెల 17వ తేదీ జరిగిన యోగాంధ్ర రాష్ట్ర స్థాయి పోటీలలో జాతీయ సంస్కృత వర్సిటీ ఎమ్మెస్సీ యోగా థెరఫి చదువుతున్న విద్యార్థి రామచంద్ర శ్రీకాంత్ అత్యుత్తమ ప్రతిభ కబరచి రెండవ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా గురువారం వర్సిటీలో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి విద్యార్థిని ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరిగిన యోగాంధ్ర పోటీలలో వర్సిటీ విద్యార్థి రామచంద్రశ్రీకాంత్ పాల్గొని ద్వితీయ బహుమతిని అందుకోవడం గర్వంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ కేవీ నారాయణరావు, యోగా విజ్ఞాన విభాగాధిపతి డాక్టర్ తపన్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ ఆర్ లక్ష్మి నారాయణ, డాక్టర్ అజయ్, అధ్యాపకులు పాల్గొని అభినందించారు.

## 21న ఎస్వీయూ స్టేడియంలో యోగాంధ్ర

తిరుపతి విద్య, జూన్ 19 ప్రభాత వార్త

ఎస్వీయూ ఎన్టీఆర్ స్టేడియంలో ఈనెల 21వ తేదీన ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 3వేల మంది విద్యార్థులతో పాటు జిల్లా యంత్రాంగం పాల్గొంటున్న ఈ యోగా కార్యక్రమానికి సుమారు 7వేల మంది హాజరవుతారని తెలియజేశారు. 21వ తేదీ ఉదయం 5.45 నుంచి 7.15వరకు యోగాంధ్ర కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయడం జరిగిందని తెలిపారు.

## లిటిల్ ఏంజల్స్ విద్యార్థికి ఎక్సలెన్స్ అవార్డు

తిరుపతి విద్య, జూన్ 19 ప్రభాత వార్త:



టి సి ఎస్ భాగస్వామ్యంతో వ్యర్థాలను ఉపయోగించి కొత్త ఉత్పత్తులను తయారు చేయడానికి అవలంబించే ఐదు పద్ధతులు అనే అంశంపై ఆగస్టు 2023 నిర్వహించిన వ్యాసరచన పోటీలలో ఆర్.రెడ్డి గీతిక జిల్లా స్థాయిలో పాల్గొని తరువాత రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో విజేతగా నిలిచింది. డిల్లీ లో రాష్ట్రపతి భవన్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా లిటిల్ ఛాంప్ ఎక్సలెన్స్ అవార్డును పొందడం తిరుపతికే కాకుండా మన రాష్ట్రానికి కూడా గర్వకారణమని డైరెక్టర్ డా.శ్వేత రెడ్డి ప్రశంసించారు. లిటిల్ ఏంజల్స్ పేరు ప్రఖ్యాతులను జాతీయ స్థాయిలో శిఖరాగ్రమున నిలిపిన ఆర్.రెడ్డి గీతిక భవిష్యత్తులో అంచలంచలుగా ఎదిగి ఎన్నో అవార్డులను సాధించాలని పాఠశాల అధినేత కె.రాజగోపాల్ రెడ్డి అభిలషించారు. పాఠశాల ప్రధానో పా ధ్యాయురాలు ఎస్. శర్వాణి, ఉపాధ్యాయ బృందం ఆర్.రెడ్డి గీతికను పుష్పగుచ్చం తో సత్కరించారు.

## విద్యే అభివృద్ధికి మూలం

### టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 19 ప్రభాతవార్త:



విద్యే అభివృద్ధికి మూలమని టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం మన సంస్కృతి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు కాయం హరినాథ్ రెడ్డి కెకెవి పురం ఎంపిపి పాఠశాలలో విద్యార్థులకు విద్యా సామగ్రిని వితరణ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరుపోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రతి ఒక్కరూ సేవాధృక్పథంతో తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటికీ ఒక మొక్కను నాటి సంరక్షించి పర్యావరణాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మన సంస్కృతీ ట్రస్ట్ సభ్యులు జయరామ్, మునెయ్య, చండీశ్వర్ రెడ్డి, తదితరుతలు పాల్గొన్నారు.

## గంగమ్మ అమ్మవారిని దర్శించుకున్న చినబాబు

విజయపురం, జూన్ 19 ప్రభాతవార్త:



మండలంలోని గంగమాంబాపురం గ్రామంలో జరిగిన గంగజాతర మహోత్సవంలో గురువారం చిత్తూరు పార్లమెంట్ పార్టీ అధికార ప్రతినిధి చినబాబు పాల్గొని అమ్మవారిని దర్శించ ుకున్నారు. వీరితో పాటు మండలపార్టీ ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, స్థానిక నాయకులు, పలువురు పాల్గొన్నారు.

## పేద ప్రజల ఆశాజ్యోతి చంద్రబాబు

రేణిగుంట జూన్ 19 ప్రభాతవార్త



పేద ప్రజల ఆశాజ్యోతి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. రేణిగుంట మండలంలో అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నలుగురికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి 5,02,000 మంజూరు చేయించి గురువారం చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. కుటుంబంలో పెద్ద బిడ్డలాగ ముఖ్యమంత్రి పేద ప్రజలను ఆదుకుంటున్నారని అన్నారు. చెక్కులు పంపిణీ కార్యక్రమంలో రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, సంపత్, తదితరులు పాల్గొన్నారు.

## జనసేనచే అన్నదానం

శ్రీకాళహస్తి, జూన్ 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పట్టణంలోని పెండ్లి మండపం వద్ద గురువారం జనసేన సారథ్యంలో అన్నదానం జరి పారు. పట్టణ నడిబొడ్డులో ఏర్పాటు చేసిన అన్న దానంలో వందలాదిమందికి భోజనం వడ్డించారు. ప్రతి గురువారం నిర్వహించే కార్యక్రమాలు 49 వారాలుగా పేదల కడుపు నింపుతున్నారు. ఈ కార్యక్రమాల్లో జనసేన నాయకులు కావలి శివకుమార్, తోట గణేష్, రవికుమార్‌రెడ్డి, జ్యోతిరామ్, సురేష్, వెంకటరమణ యాదవ్, లక్ష్మీ, రాజ్యలక్ష్మీ, మాలతి, దినేష్, ఉదయ్, సాయి, వినోద్, ఆశోక్, బ ఇయస్‌యస్ దుమ్మురాయల్, బియస్‌యస్ మురళి తదితరులు పాల్గొన్నారు.

## శివయ్యసేవలో ఎపి టూరిజం చైర్మెన్

శ్రీకాళహస్తి, జూన్ 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం గురువారం అతిధులతో కిట కిట లాడింది. ఉదయం నుంచి అ తిధుల సేవల్లో ఉద్యోగులు తలమునకలయ్యారు. ఈ నేపధ్యంలో ఎపిటూరిజం చైర్మెన్, ప్రకాశం జిల్లా పార్టీ అధ్యక్షుడు నూకసాని బాలాజి కుటుంబసభ్యులతో శివయ్య దర్శనానికి ఎఇఒ మోహన్ దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలు వేదపండితులతో స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం తరువాత వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.

***ఎపిటూరిజం హరిత పరిశీలన:***

శ్రీకాళహస్తీశ్వరాలయానికి హాజరైన ఎపిటూరిజం చైర్మెన్ నూకసాని బాలాజి సమీపంలోని ఎపి టూరిజం శాఖకు సంబంధించిన హోటల్ హరితను ఆకస్మికంగా తనిఖీ చేసారు. అక్కడ ఏర్పాటైన అతిధి గృహంలో వసతులను పరిశీలించారు. అలాగే హోటల్ పర్యవేక్షణపై పరిశీలన జరిపి సూచనలు చేసారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ బాలాజి తిరుపతి ఏపి టూరిజం డివిజనల్ మేనేజర్ సిహెచ్ శ్రీనివాసరావు, శ్రీకాళహస్తి హోటల్‌మేనేజర్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో రాహుల్ జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, జూన్ 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో గురువారం కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి తలపా దామోదర్‌రెడ్డి పర్యవేక్షణలో కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా కేక్ ఏర్పాటు చేసి కట్ చేసారు. కాంగ్రెస్ పార్టీని సమర్థవంతంగా నిర్వహిస్తూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై నిర్విరామ పోరాటం సాగిస్తున్న రాహుల్ గాంధీ త్వరలోనే అధికారం చేపట్టడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమాల్లో దామోదర్‌రెడ్డితోపాటు జిల్లా మైనారిటి సెల్ కార్యదర్శి కరీముల్లా, శ్రీకాళహస్తి మండలం అధ్యక్షులు సురేంద్రరెడ్డి, గుణశేఖర్, ఆసిఫ్, నగేష్, సుబ్రమణ్యంలు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్‌ను డీకొన్న ద్విచక్రవాహన దారుడు

శ్రీకాళహస్తి, జూన్ 19 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని రామసేత వంతెన వద్ద గురువారం ఓ ద్విచక్రవాహ నదారుడు అదుపుతప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను డీకొన్నాడు. శ్రీకాళహస్తి పట్టణం నుంచి పానగల్ వైపు వెళుతూ మలుపు వద్ద వాహనాన్ని కంట్రోల్ చేయలేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుద్దుకున్నాడు. దాంతో అక్కడ స్పృహతప్పి పడిపోయాడు, దాంతో ఇక్కడ గమనించిన ప్రజలు 108కు సమాచారం అందించి ఆసుపత్రికి తరలించారు.

# తిరుపతి డివిజన్

## రాహుల్‌గాంధీ నాయకత్వంలోనే దేశం అభివృద్ధి



### జన్మదినవేడుకల్లో కాంగ్రెస్ నేతలు

తిరుపతి(రవాణ), జూన్ 19ప్రభాతవార్త

కాంగ్రెస్‌పార్టీ ఎంపి, జాతీయనేత రాహుల్ గాంధీ నాయకత్వంలోనే దేశం అభివృద్ధిసాధి స్తుందని తిరుపతి కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గౌడపేర చిట్టి బాబు తెలిపారు. దేశంలో బడుగు, బలహీనవర్గాలకు సంపూర్ణ సంక్షేమఫలాలు, పథకాలు అందాలంటే రాహుల్‌గాంధీతోనే సాధ్యమ వుతుందని అన్నారు. రాహుల్‌గాంధీ 54వ జన్మదినం సందర్భంగా తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేర చిట్టిబాబు ఆధ్వర్యంలో గురువారం ఉదయం పాతమున్సిపల్ కార్యాలయం కూడలి లోని రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కేక్‌కట్‌చేసి జరుపుకున్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో నిండు నూరేళ్ళు దేశ అభ్యున్నతికి ,ప్రగతికి దోహదపడే శక్తిసామర్థ్యాలు కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు డిసిసి అధ్యక్షుడు కళందర్, పిసిసి ఉపాధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, నాయకులు వెంకటనరసింహులు, సుప్రజ, పార్థసారధిరెడ్డి, గోపి, వెంకటేశ్, తపవన్‌కల్యాణ్, శివబాలాజీ, ప్రేమ్‌సాగర్, సలీముల్లా తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మహుండీ లెక్కింపుల్లో రూ.43లక్షలు ఆదాయం

తిరుపతి(రవాణ), జూన్ 19 ప్రభాతవార్త



తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో శాశ్వత హుండీల లెక్కింపు గురువారం జరిగింది. మేనెల 15నుండి జూన్ 19వరకు భక్తులు అమ్మ వారికి కానుకలుగా శాశ్వత హుండీలో వేసిన నగదు, నగలు లెక్కింపుల్లో 43,86,409 రూపా యలు రాగా 23గ్రాముల 100మిల్లీగ్రాములు బం గారు. 328గ్రాములు వెండి వచ్చింది. పరకా మణిలో ఎండోమెంట్ ఇన్స్పెక్టర్, ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు ,సేవాకుటుంబం, ఈస్టు పోలీసులు పాల్గొన్నట్లు ఆలయ ఈఓ జయకుమార్ తెలిపారు.

## వికసిత్‌భారత్ 2047 అమృతకాలం

తిరుపతి(రవాణ), జూన్ 19ప్రభాతవార్త



బిజెపి 11సంవత్సరాల పాలనపై బిజెపి కార్య కర్తలు, నాయకుల సమావేశం గురూవారం జరిగింది,. వికసితభారత్ 2047 అమృత కాలం 11 సంవత్సరాలు పాలన పూర్తిచేసు కోవడంతో మోదీ అభివృద్ధిలో ప్రజలను భాగ స్వాములు చేస్తున్నారని భాస్కర్ తెలిపారు. బిజెపి పదరమమండలం నాయకుల కార్యకర్తల సమావేశం సుబ్బుయాదవ్ అధ్యక్షతన గాంధీభవన్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగాఅజయకుమార్, వరప్రసాద్, పొనగంటి భాస్కర్, మల్లకుప్పం శేఖర్ పాల్గొన్నారు. మోదీపాలనసుపరిపాలన, దేశరక్షణ, పేదలకుసంక్షేమపథకాలుఅందిస్తూండటం మంచి దన్నారు. బిజెపి నాయకులుశేఖర్, సుబ్బుయాదవ్, ప్రేమ్‌కుమార్, రమేశ్, గంధంవెంకటముని, రవి, రమేశ్‌పాల్గొన్నారు.

## ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలి

### అమ్మవారిని వేడుకున్న బొజ్జల, డాలర్స్...

రేణిగుంట జూన్ 19 ప్రభాతవార్త..



ప్రజలంతా శ్రీశ్రీశ్రీ గంగమ్మ తల్లి ఆశీర్వాదంతో సుఖశాంతులతో వర్ధిల్లాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి అమ్మవారిని వేడుకున్నారు. రేణిగుంట మండలం కరకంబాడి నందు కొలువు తీరిన శ్రీశ్రీశ్రీ గంగమ్మ తల్లి జాతర గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి బొజ్జల రిషితా రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి జాతర నిర్వాహకులు ఆలయం మర్యాదలతో స్వాగతం పలుకగా మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంటరీ ఉపాధ్యక్షులు చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, రేణిగుంట మండల టిడిపి అధ్యక్షుడు చంద్రారెడ్డి, కరకంబాడి టిడిపి క్లస్టర్ ఇన్చార్జి బుజ్జి నాయుడు, రేణిగుంట పట్టణ టిడిపి అధ్యక్షుడు మహబూబ్ బాషా, రేణిగుంట టిడిపి క్లస్టర్ ఇంచార్జి పుష్పనాదం, టిడిపి సీనియర్ నేతలు భాస్కర్ రెడ్డి, చిన్నారెడ్డి, అడ్వకేట్ ఉదయ్ కుమార్ రెడ్డి, కన్నన్ రెడ్డి, రేణిగుంట పట్టణ టిడిపి యువ నాయకులు ఎంజీ రెడ్డి, ఆయన మిత్రబృందం పాల్గొన్నారు.

## కోలా ఆనంద్ ముందస్తు జన్మదిన వేడుకలు....

### ఘనంగా కోలా విశాలాక్షి జన్మదిన సంబరాలు..

రేణిగుంట జూన్ 19 ప్రభాతవార్త



బిజెపి రాష్ట్ర కార్యదర్శి శ్రీకాళహస్తి నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి కోలా ఆనంద్ కుమార్ ముందస్తు జన్మదిన వేడుకలు, కోలా ఆనంద్ కుమార్ సతీమణి కోలా విశాలాక్షి జన్మదిన సంబరాలు రేణిగుంట మండలం పట్టణంలోని అనేక ప్రాంతాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. గురవరాజు పల్లె గ్రామంలో బిజెపి యువ నాయకులు రాజారాయలు ఆధ్వర్యంలో కోలా ఆనంద్ ను గజమాలతో సత్కరించారు. రేణిగుంట బస్టాండ్ ఆవరణలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ సమక్షంలో మొక్కలు నాటి పెద్ద ఎత్తున నిరుపేదలకు భోజనం వడ్డించారు. నిర్వహించారు. కరకంబాడి జాతరలో పాల్గొని శ్రీశ్రీశ్రీ గంగమ్మ తల్లి ఆశీస్సులు తీసుకున్నారు. రేణిగుంట విమానాశ్రయ సమీపంలోని అక్షయ క్షేత్రంలో మొక్కలు నాటి కుర్రకాలవ వేణు ఆధ్వర్యంలో మానసిక వికలాంగులకు అన్నసంతర్పణ చేశారు. రేణిగుంట చెక్ పోస్ట్ వద్ద రాజా రాయల్ ఆఫీస్ లో కేక్ కటింగ్ కార్యక్రమం జరిగింది. రేణిగుంట పట్టణానికి చెందిన బిజెపి యువ నాయకుడు ఉదయ్ ఆధ్వర్యంలో ఆయన మిత్ర బృందం శ్రీకాంత్, ప్రేమ్, పవన్, వంశి తదితరులు కోలా ఆనంద్, ఆయన సతీమణి కోలా విశాలాక్షిని ఘనంగా సత్కరించారు. వీరంతా తేజో భారత్ ట్రస్ట్ ద్వారా కోలా విశాలాక్షి చేతుల మీదుగా రేణిగుంట గుంటకట్ట ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ చేశారు.

## ఉపాధి హామీ కూలీలను వ్యవసాయానికి అనుబంధం చేయాలి

రేణిగుంట, జూన్ 19 ప్రభాతవార్త



ఉపాధి హామీ కూలీలను వ్యవసాయానికి అను సంధానం చేస్తే కూలి దినాలు పెరిగే అవకాశం ఉందని బిజెపి యువ నాయకులు వెంకటాద్రి యాదవ్ అన్నారు. రేణిగుంట మండలంలోని పలు గ్రామాల ఉపాధి హామీ కూలీలతో గురువారం ఆయన మమేకమై వారి బాధలను తెలుసు కున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు కనీసం 200 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. వారిని వ్యవసాయానికి అనుసంధానం చేస్తే ఎంతో మేలు జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ప్రతి వ్యవసాయకులకి రోజుకు 400 రూపాయలు తగ్గకుండా కూలి రేట్లు నిర్ణయించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. భారతదేశం వ్యవసాయ ప్రధాన దేశమని వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ ఉపాధి హామీ కూలీలను వ్యవసాయానికి అనుసంధానం చేయడం వల్ల అటు రైతులకు ఇటు ఉపాధి హామీ కూలీలకు మేలు జరుగుతుందని తెలిపారు.

## మనం ఎక్కడున్నా అంకిత భావంతో పనిచేయాలి

పాకాల, జూన్ 19, ప్రభాతవార్త



పాకాల స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో గురువారం రోజున ఉపాధ్యాయుల బదిలీల సందర్భంగా నిర్వహించిన సమావేశంలో భాగంగా మనం ఎక్కడున్నా అంకితభావంతో పని చేసినప్పుడే సమాజములో మంచి పేరు వస్తుందని పాకాల మండల విద్యా శాఖాధికారి బాబ్జి అన్నారు. గురువారం స్థానిక యమ్.ఆర్.సి నందు పాకాల మండలం నందు పనిచేస్తూ ఇతర మండలాలకు బదిలీ మీద వెళ్లిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించారు. సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపు ఉందని దానిని మనం నిలపెట్టుకోవాలని కోరారు. సమాజాన్ని మార్చే శక్తి ఒక ఉపాధ్యాయుడికే ఉందని వారు అన్నారు. ఎంఈఓ 2 లింగయ్య మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పదని అన్నారు అనంతరం బదిలీ పై వెళ్ళిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కుమార్ రెడ్డి, సుమలత, వెంకట నారాయణ చౌదరి, పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాలు



గూడూరు, జూన్ 19 ప్రభాతవార్త : పట్టణంలో రాష్ట్ర, జిల్లా కమిటీల పిలుపు మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాల్లో భాగంగా ఇంజనీరింగ్ పారిశుద్ధ్య కార్మికుల కు సంక్షేమ పథకాలు అమలుకు నిరసనగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు సంఘం గూడూరు పట్టణ కార్యదర్శి దారా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మాయాబజార్ లోని సీఐటీయు కార్యాలయం వద్ద నుండి ఇంజనీరింగ్, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు బైక్ ర్యాలీ ప్రదర్శన నిర్వహిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేయాలని తల్లికి వందనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని, వినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ చేపట్టడం జరిగింది. బైక్ ర్యాలీ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం మీదుగా సాదుపేట సెంటర్, వివేకానంద రోడ్డు, పాత బస్టాండు, సంగం థియేటర్, గాంధీ బొమ్మ, బజార్ వీధి, పెద్ద మసీదు, పురవీధులలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, గూడూరు పట్టణ సిఐటియు అధ్యక్షులు పామంజి మణి, ప్రధాన కార్యదర్శి బివి రమణయ్య, గూడూరు మున్సిపల్ సంఘం అధ్యక్షులు బి.రమేష్, కమిటీ సభ్యులు జి. మణి, భూలోక పెంచల ప్రసాద్ (పి.పి) కెవిపిఎస్ నాయకులు అడపాల ప్రసాద్, యన్.వెంకట రమణ, బి.మురళి, రాజేష్, రాగయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు పుట్టా శంకరయ్య, సేలం శేఖరాచారి, ఏం బేటి చంద్రయ్య, బి.అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

## యోగా డేని విజయవంతం చేయండి



కోట, జూన్ 19 ప్రభాతవార్త: శనివారం జరిగే యోగాంధ్ర-2025లో భాగంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కె.జయజయ రావు, ఎంపిడిఓ దిలీప్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని సుమారు 140 ప్రదేశాల్లో ఒక్కొక్క ప్రాంతానికి సచివాలయ సిబ్బందిని ఇన్‌ఛార్జ్‌గా నియమించామన్నారు. ఆ సచివాలయ పరిధిలోని ప్రజలు, ఉపాధి శ్రామికులు, పొదుపు గ్రూపుల సభ్యులు, ప్రజాప్రతినిధులు, యువత ఉదయం 7 నుంచి 8 గంటలలోపు యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, గురుకుల విద్యాలయాల్లో యోగా డే కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ఎంఇఒ మస్తానయ్య, ఏపిఎం అనిల, గృహ నిర్మాణ సంస్థ ఏఇ భాస్కర్‌రావు, సిడిపిఓ మునికుమారి, మండల వైద్యాధికారులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లపై గొడ్డలి వేటు



కోట, జూన్ 19 ప్రభాతవార్త : మండలం తిన్నెలపూడి పంచాయతీ రంగన్నగుంట సమీపంలో ఆర్అండ్‌బి రహదారి పక్కన చెట్లను కొందరు నిలువునా నరికేయడంతో ప్రజలు మండిపడ్డారు. చెట్లను నరికేయడంపై ఈ రోడ్డుపై రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. మరోవైపు అధికారులు మొక్కలు నాటాలని, సంరక్షించాలని ఆర్భాటంగా ప్రకటనలు ఇస్తున్నారే తప్ప పచ్చని చెట్లను నరికేస్తున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

## జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయండి

సూళ్లూరుపేట, జూన్ 19 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న జగన్నాథ రథయాత్రను విజయవంతం చేయాలని నెల్లూరు ఇస్కాన్ సంస్థ అధ్యక్షులు శుకదేవస్వామి గురువారం తెలిపారు. 28వ తేదీన శనివారం ఈ రథయాత్ర భారీస్థాయిలో నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. సూళ్లూరుపేట పట్టణంలోని షార్ బస్టాండు వద్ద నుంచి పట్టణ పురవీధులు గుండా ఈ రథయాత్ర కొనసాగుతుందని చెప్పారు. ముగింపుగా చెంగాళమ్మ గుడి సమీపంలోని శ్రీనగర్ కాలనీలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఆధ్యాత్మిక ప్రదర్శనలు, ప్రవచనాలు ప్రముఖులచే ఇవ్వబడతాయని శుకదేవస్వామి తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. భక్తులు, సూళ్లూరుపేట పట్టణ ప్రజల సహకారంతో ఈ రథయాత్ర విజయవంతం చేసేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఈ రథయాత్రను రెండు పర్యాయాలు సూళ్లూరుపేట పట్టణంలో నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం నిర్వహించే రథయాత్ర ప్రత్యేక రథంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఉంచి మేళతాళాలు, భజన బృందాలతో పుర సంకీర్తన కార్యక్రమం జరుగుతుందన్నారు. తమిళనాడు, ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల నుంచి 300 మంది ఇస్కాన్ ప్రతినిధులతో పాటు విదేశీ ఇస్కాన్ భక్తులు ఈ కార్యక్రమంలో భాగస్వాములవుతారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని శుకదేవస్వామి విజ్ఞప్తి చేశారు. సనాతన ధర్మాన్ని కాపాడే ప్రయత్నంలో భాగంగా ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ రథయాత్ర చేపడుతున్నట్లు ఆయన చెప్పారు.

## నియోజకవర్గ పరిశీలకులుగా రాధాకృష్ణారెడ్డి



కోట, జూన్ 19 ప్రభాతవార్త : సర్వేపల్లి నియోజకవర్గంలో జరుగుతున్న సంస్థాగత ఎన్నికలకు పరిశీలకులుగా కోటకు చెందిన జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూపిలి రాధాకృష్ణారెడ్డిని పార్టీ అధిష్ఠానం నియమించింది. ఆ మేరకు గురువారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో తూపిలి రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు. పార్టీ సూచనల మేరకు సర్వేపల్లి నియోజకవర్గంలో మండలాల వారీగా గ్రామ కమిటీల నియామకం గురించి, అనుబంధాల సంఘాల భర్తీ, కుటుంబ సాధికార సారథుల ఎంపిక జరుగుతుందని చెప్పారు.

## నిందితుడి అరెస్ట్

కోట, జూన్ 19 ప్రభాతవార్త : మండలం నెల్లూరుపల్లి పంచాయతీలో శ్రీహరిపై పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని సూర్య అనే వ్యక్తి కత్తితో హత్యాయత్నం చేసిన కేసులో నిందితుడు సూర్యను గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు. శ్రీహరికి, సూర్యకు గత కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నాయని ఎస్ఐ తెలిపారు. ఈ క్రమంలో శ్రీహరిపై సూర్య హత్యాయత్నం చేశాడని పేర్కొన్నారు.

## పాఠశాల వద్ద తల్లిదండ్రులు, స్థానికులు నిరసన



చిల్లకూరు, జూన్ 19 ప్రభాతవార్త : గ్రామంలో ఉన్న పాఠశాల నుండి వేరే పాఠశాలకు తమ పిల్లలను పంపించ లేమని, అధికారులు సమస్య గుర్తించి పరిష్కరించాలని స్థానికులు అభ్యర్థించారు. చిల్లకూరు మండలంలోని ఏరూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల వద్ద తల్లిదండ్రులు, స్థానికులు నిరసన వ్యక్తం చేశారు. చిల్లకూరు మండలంలోని ఏరూరు గ్రామంలో ఒకటో తరగతి నుండి ఎనిమిదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాల ఏర్పాటై ఉంది. ఈ పాఠశాలలో స్థానిక విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో భాగంగా ఒకటి నుండి 5వ తరగతి వరకు చదివే పిల్లలను సమీపంలోని అల్లీపురం పాఠశాలలోని తరగతులకు మార్చారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.పాఠశాల ముందు వారంతా కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పాఠశాలలో చదువుకుంటున్న తమ పిల్లలను రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న మరో పాఠశాలకు వెళ్ళి చదువుకోమని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ప్రధాన రహదారి మీదుగా అల్లీపురం పాఠశాలకు వెళ్ళాల్సి ఉందని, ఆ మార్గంలో భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయని చెప్పారు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున అధికారులు స్పందించి తమ గ్రామంలోని పాఠశాలలోనే పిల్లలు చదువుకునే వెసులుబాటు కల్పించాలని వారు కోరారు.

## యోగాతో శరీరక, మానసిక ఉల్లాసం



గూడూరు, జూన్ 19 ప్రభాతవార్త: పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాలలో శ్రీ రామచంద్ర మిషన్ హార్ట్ ఫుల్ నేస్ ధ్యాన కేంద్రం సాకారంతో విద్యార్థినిలకు యోగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఒత్తిడికి లోనవుతున్నారని చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలు వస్తున్నాయని అన్నారు. యోగా ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని ప్రతి ఒక్కరు ప్రతిరోజు యోగా చేయాలని దీంతో మానసిక శారీరక ఉల్లాసం పెరుగుతుందని సూచించారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల యోగాకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయని మనమందరము సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## జూలై 6న సామూహిక శ్రీ సత్యనారాయణ వ్రతం

గూడూరు, జూన్ 19, ప్రభాతవార్తఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య గూడూరు శాఖ వారి ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఆషాఢ ఏకాదశి ఈ నెల 6వ తేది ఆదివారం ఉదయం 9,00 గంటలకు గూడూరు రెండవ పట్టణంలోని వి ఎస్ ఆర్ స్కూలు ప్రక్కన గల శ్రీ ముంగమూరు సీతమ్మ బ్రాహ్మణ భవనమందు సంఘ అధ్యక్షులు వారు శ్రీ అనిమెళ్ల, శివకుమార్ ఆదేశానుసారం నెల్లూరు వాస్తవులు గొప్ప కవి, పండితోపన్యాసకులు విశ్రాంత తెలుగు పండితులు అగు బ్రహ్మశ్రీ ఆలూరి శిరోమణిశర్మ, దంపతుల ఆధ్వర్యంలో శ్రీ సత్యనారాయణ స్వామి వారి సామూహిక వ్రత మును చేయుటకు కమిటీ వారు నిర్ణయించారు. గూడూరు పట్టణంలోని బ్రాహ్మణ బంధువులు అందరూ ఈనెల 30వ తారీఖు లోపల తమ పేర్లను రూ.500 (ఐదువందల రూపాయలు) రుసుముతో నమోదు చేసుకోవలసిందిగా కోరారు. పూజకు కావలసిన సామాగ్రి మొత్తం కమిటీ వారు సమకూరుస్తారు. మీరు పంచ పాత్రలు, రెండు గ్లాసులు తీసుకొనిరావలెనన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాదములు, భోజన సదుపాయము కల్పించబడినది కావున బ్రాహ్మణ బంధువులు ఈ అవకాశమును సద్వినియోగ పరచుకోవలసినదిగా కోరారు.

## బైక్ ర్యాలీ నిర్వహించిన మున్సిపల్ కార్మికులు



వెంకటగిరి, జూన్ 19 ప్రభాతవార్త: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల పిల్లలకు తల్లికి వందనం పథకం అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వడ్డీపల్లి చంగయ్య కోరారు. మున్సిపల్ కార్మికులు పట్టణ పురవీధుల్లో రెండో రోజు బైక్ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్మికులు చాలా పేదవారని జీతాలు కూడా వారికి సక్రంగా రావడం లేదని వీరి పిల్లలకు తల్లికి వందనం అమలు చేయకపోవడం విచారకరమన్నారు. తల్లికి వందనం పథకం పారిశుద్ధ కార్మికులు పిల్లలకి ఇవ్వకపోతే వారి పిల్లలను చదివించుకోలేరని తెలిపారు. కార్మికులకు జీతాలు ప్రతినెల సక్రమంగా ఇవ్వాలని కోరారు. పెంచిన జీతాలు కూడా వెంటనే ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

# మోడల్ స్కూల్ వద్దు...యూపీ స్కూలే ముద్దు!



వెదురుకుప్పం,జూన్ 19 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం విద్య వ్యవస్థలు మార్పులు తీసుకువచ్చి మెరుగైన ఫలితాలు సాధించాలని ఆశయంతో మోడల్ విధానం తీసుకువచ్చింది... దీంతో క్షేత్ర స్థాయిలో విద్యార్థులకు కొత్త కష్టలు తీసుకువచ్చిందని తల్లిదండ్రులు, విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. అందులో భాగంగా చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలంలో గురువారం నిరసనకు దిగారు. మోడల్ స్కూల్ వద్ద యూపీ స్కూల్ ముద్దు అంత దూరం నడవలము అంటూ యనమలమంద ప్రాథమి కోన్నత పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. గ్రామస్థుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి యనమలమంద గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల ఏర్పాటు చేశారు. ఒకటి నుంచి ఏడు వరకు తరగతులు నడుపుతున్నారు. 96 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని చెప్పారు. కాగా కూటమి ప్రభుత్వం ప్రతి తరగతికి ఒక్క ఉపాధ్యాయులు ఉండటం వలనే విద్యాభివృద్ధి సాధ్యమవుతుందని భావించి మోడల్ స్కూల్ విధానం తీసుకురావడం జరిగింది. గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 117 జీవో రద్దు చేసి మోడల్ పాఠశాలలు తీసుకురావడం జరిగింది. దీంతో యనమలమంద ప్రాథమి కోన్నత పాఠశాల కాస్త మోడల్ స్కూల్‌గా మారింది. ఆరు, ఏడు తరగతులు చదువుతున్న విద్యార్థులు ఆళ్ళమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్ళవలసిన పరిస్థితి ఏర్పడింది. ఐతే సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్ళడం చాలా కష్టమని అటవీ ప్రాంతం కావడం వలన ఇబ్బందులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుమాళ్ళపల్లె మోడల్ స్కూల్‌గా మార్చడంతో మారేపల్లె హరిజనవాడ ప్రాథమిక పాఠశాలను అక్కడ కలపడంతో సమస్యలు ఉత్పన్నమైనాయని చెప్పారు. సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలలో కలపడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అక్కడ నాగరాజు కుమారుడు గౌతమ్ మూడవ తరగతి చదువుతున్నాడు. అతను దివ్యాంగుడు కావడంతో సొంతంగా నడవలేడు... తినలేడు అలాంటి బిడ్డను ఏలా పంపాలని ప్రశ్నించారు. సమస్యలు పరి ష్కారించాలని డిమాండ్ చేశారు.

## అంగన్‌వాడీ కార్యకర్తపై దాడిచేసినా పట్టించుకోరా..?



కుప్పం, జూన్ 19 ప్రభాతవార్త : ప్రశాంతంగా ఉన్న కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ రౌడీషీటర్లను ప్రోత్సహిస్తే ప్రజలే తగు బుద్ధి చెబుతారని తెదేపా నేతలు రాజగోపాల్, శివకుమార్, చెక్కునత్తం మణి,ధనశేఖర్, వసంతమ్మ, సంతోష్, రిజ్వాన్, హైదర్‌వలీ, అశోక్, పార్థసారథి, గౌస్ తదితరులు పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.రాగిమానుమిట్ట గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్త నజ్మాపై వైకాపా కోఆప్షన్ సభ్యుడు అతహర్ దాడి చేసి బెదిరించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. నారాయణపురం సంఘటన టిడిపి వారే చేశారని వీడియోల్లో పేర్కొన్న భరత్ ఈ సంఘటనపై ఎందుకు నోరుమెదపడం లేదన్నారు. మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పార్టీ కార్యకర్తలకు ఏకష్టం వచ్చినా ముందుంటారని అతనికి రాగిమానుమిట్ట విషయం తెలియగానే ఆస్పత్రికి వెళ్లి అంగన్‌వాడీ కార్యకర్తను పరామర్శించారన్నారు. ఆయనే దగ్గరుండి కేసులు పెట్టించారని అతహర్ పేర్కొనడం దారుణమన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త నజ్మాను భరత్, అతహర్‌లు ఇదివరకే బెదిరించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అతహర్‌ను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తపై దాడికి దిగిన అతహర్‌ను పోలీసులు అరెస్ట్ చేయాలన్నారు. నజ్మా భర్త అంజద్ మాట్లాడుతూ తన భార్యను అతహర్ కొట్టి దాడి చేశాడన్నారు. పైప్‌లైన్ సైతం గ్రామంలో పగలగొట్టాడన్నారు. గాయపడ్డ తన భార్యను తానే ఆస్పత్రికి తరలించి పార్టీ నేతలకు సమాచారం ఇవ్వగా వారు ఆస్పత్రికి వచ్చారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్‌కు ఈ ఘటనకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

## నేడు శ్రీవకుళమాత ఆలయ తృతీయ వార్షికోత్సవం

తిరుపతిరూరల్, జూన్19 ప్రభాతవార్త: కలియుగదైవం శ్రీవేంకటేశ్వరస్వామి తల్లియైన శ్రీవకుళమాత ఆలయం తృతీయ వార్షికోత్సవం జూన్ 20న నిర్వహించేందుకు టిటిడి ఏర్పాట్లు చేపట్టింది. తిరుపతిరూరల్ పేరూరు బండపై వెలసిన శ్రీవకుళమాత ఆలయం విరాజిల్లుతుంది. శ్రీనివాసుని దివ్యానుగ్రహం, భక్తుల సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానములు సువర్ణ శోభితమైన దివ్య విమాన రాజగోపురములతో కూడిన సుందరమైన ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయం నందు శ్రీవారి ఆజ్ఞ మేరకు శ్రీవారికి నిత్యోత్సవాది కైంకర్యములను నిర్వహించే శ్రీవేఖానసస భగవచ్ఛాస్త్రోక్త విధిగా సంప్రోక్షణాది కార్యక్రమాలు నిర్వహించి భక్త జనులకు అమ్మవారి దర్శనం కల్పించుటకు సకల సౌకర్యములు కల్పించారు. ఆలయం పునఃనిర్మితమైన అనతికాలంలోనే అమ్మవారి అనుగ్రహం వలన తమ అభీష్టసిద్ధి పొందిన భక్తులు విశేష సంఖ్యలో విచ్చేస్తున్నారు.

**నేడు అమ్మవారికి నిర్వహించే కార్యక్రమాలు**

శుక్రవారం ఉదయం 5:30-6.00గంటల మధ్య సుప్రభాతం, ఉదయం 6-8గంటల మధ్య నిత్యకైంకర్యాలు, మూలవర్లకు అభిషేకం, అలంకారం, నివేదన ఉదయం 9-11గంటల మధ్య విష్వక్సేసారాధన, పుణ్యాహవచనం, అంకురార్పణం, మహాశాంతి హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. ఉదయం 11-12గంటల మధ్య ఉత్సవమూర్తులకు అష్టోత్తర శతకలశాభిషేకము చేపడతారు.

## పల్లం పాఠశాలను పరిశీలించిన శ్రీలంక బృందం



శ్రీకాళహస్తిరూరల్,జూన్ 19 ప్రభాతవార్త : ఏర్పేడు మండలం పల్లం గ్రామానికి చెందిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం శ్రీలంక దేశానికి చెందిన ప్రతినిధి బృందం 45 మంది విద్యావేత్తలు పరిశీలించారు.భారత దేశంలోని విద్యావ్యవస్థను అధ్యయనం చేయటానికి ఇక్కడి పాఠశాలల్లో బోధనా విధానాలను, ఉపాధ్యాయుల పని తీరుని,పాఠశాలలో ఉండాల్సిన సదుపాయాల్ని గురించి పరిశీలించి తమ ప్రాంతాల్లో అమలుకు శ్రీలంక ప్రభుత్వం ఆదేశాలతో ఇక్కడకు వచ్చారు.పాఠశాలలో ప్రభుత్వం మరియు ప్రవేటు వ్యక్తులచే సమకూర్చిన సదుపాయాల్ని పరిశీంచి ఆనంద పడ్డారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యావిధానం పరిశీలించారు.అనంతరం మహేంద్ర ,పేరారిలు మీడియాతో మాట్లాడుతూ భారత దేశంలో ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్రంలో విద్యావిధానం వ్యవస్థ పటిష్టంగా ఉందని ప్రభుత్వ సహాకారం అద్భుతంగా ఉందన్నారు. ఇక్కడ సిలబస్ కూడా చక్కగా ఉందన్నారు. శ్రీలంకకు చెందిన మహిళా ఉపాధ్యాయులు,సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాల ద్వారా విద్యార్థులను ఉత్తేజపరచారు. అనంతరం శ్రీలంక ప్రతినిధులను పాఠశాలప్రదానోపాధ్యాయులు ఆనంద్ వారి మిత్రబృందం సత్కరించిన మెమొంటోల బహూకరించారు. ఉపాధ్యాయులు వెంకటరత్నం.శ్రీనివాసులు, బాబు,సోమశేఖర్ వాణి, విజయశేఖర్ వెంకటరామయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## ట్రస్ట్‌చే ఉచిత కంటి వైద్య శిబిరం



గూడూరు, జూన్ 19 ప్రభాతవార్త : చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు, తిరుపతి జిల్లాలలో అనేక వైద్య శిబిరాలు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిరుద్యోగ యువతకు శిక్షణా తరగతులు ఏర్పాటు చేయడం జరిగిందని ట్రస్ట్ తివీ కృష్ణ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్లో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాల్లో చాగనం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తిరుపతి అరవింద్ కంటి వైద్యశాల డాక్టర్లతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణ, పరిసర గ్రామాల నుండి ప్రజలు వచ్చి కంటి పరీక్షలు నిర్వహించుకున్నారు. ఉచితంగా మందులు కళ్లద్దాలు అందజేశారు ట్రస్ట్ ఏఓ మాట్లాడుతూ చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరు తిరుపతి జిల్లాలలో అనేక సేవా కార్యక్రమాల నిర్వహిస్తున్నామని పలు కేంద్రాలలో నిరుద్యోగ యువతీ యువకులకు శిక్షణ తరగతుల ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఫస్ట్ వ్యవస్థాపకులు గౌరీ శంకర్ వారి సొంత నిధులతో పెళ్ళాకూరు గ్రామంలో కళ్యాణ మండపం ఏర్పాటు చేయడం అయిందని పేదలకు ఉచితంగా ఇస్తామని తెలిపారు.

## రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు:ఎంపీడీవో

బాలాయపల్లి, జూన్ 19 ప్రభాతవార్త: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు ఉచితంగా పండ్ల మొక్కలు పెంచుకోవచ్చని ఎంపీడీవో డీజే వినీల్ కుమార్ తెలిపారు. మామిడి, నిమ్మ, జీడి మామిడి, కొబ్బరి, నేరేడు, చింత వంటే మొక్కలను పెంచుకోవచ్చు అని తెలిపారు. వీటి కోసం కూలీలు, ఇతర ఖర్చులను ప్రభుత్వ భరిస్తున్నారు తెలిపారు. చట్లను బట్టి మూడు సంవత్సరాలు రెండు సంవత్సరాలు పెంచేందుకు ఖర్చులు ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. రైతులు అవకాశాన్ని సద్విని చేసుకోవాలని కోరారు.

## చిన్నారులకు పౌష్టికర ఆహారం సమృద్ధిగా అందుతోంది : సిడిపిఓ



వెంకటగిరి, జూన్ 19 ప్రభాతవార్త: అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికార ఆహారం సమృద్ధిగా అందుతున్నట్లు సిడిపిఓ శంషాద్ బేగం తెలిపారు. సోమసానిగుంట, పంచాయతీ పరిధిలోని బొగ్గుల మిట్ట, సోమసానిగుంట, తోలుమెట్ట, పోలీసు లైన్ ప్రాంతాల్లో ఉన్న అంగన్వాడి కేంద్రాన్ని గురువారం సిడిపిఓ ఆకస్మిక తనిఖీ చేశారు. చిన్నారులను, వారి తల్లులను అంగన్వాడీ కేంద్రాల్లో ఇస్తున్న ఆహారం ఏవిధంగా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఆహారం నాశరకంగా లేదని బాగుందని స్థానికులు తెలిపారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అంగన్వాడి సిబ్బంది ఇస్తున్నట్లు చెప్పారు. స్కూల్‌లో ఇచ్చే ఆహార పదార్థాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పిల్లలు కూడా అంగన్వాడి కేంద్రాలకు బాగా వస్తున్నట్లు ఆమె గుర్తించారు. అంగన్వాడి సిబ్బంది విధులను బాగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ మహిత, అంగన్వాడి కార్యకర్త ముని కుమారి, ఆయా, వరలక్ష్మి, గర్భవతులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో టీడీపీ కైవసం



వాకాడు, జూన్ 19 ప్రభాతవార్త: రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో మండలంలోని 19 పంచాయితీలు, జడ్పిటిసి, ఎంపీపీ పదవులను టిడిపి కైవసం చేసుకోవడం ఖాయమని మండల టిడిపి కన్వీనర్ మధుసూదన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం వాకాడు లోని షాజీ మందిర్లో తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిశీలకుల ఆధ్వర్యంలో మండల అధ్యక్షుడిగా దువ్వూరు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దోసకాయల కృష్ణమూర్తిని నూతనంగా ఏకగ్రీవంగా పరిశీలకుల సమక్షంలో నాయకులు కార్యకర్తలు బలపరచడం, పరిశీలికులు ఆమోదించడం ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల పార్టీ కన్వీనర్ దువ్వూరు మధుసూదన్ రెడ్డిని, ప్రధాన కార్యదర్శి దోసకాయల కృష్ణమూర్తిని మండల పార్టీ నాయకులు ఘనంగా శాలువా కప్పి పూలమాల వేసి సత్కరించారు. ఈ సందర్భంగా పరిశీలకులు శివ కోటారెడ్డి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నూతనంగా ఎన్నికైన మధుసూదన్‌రెడ్డి, దోసకాయ కృష్ణమూర్తి కలిసి మండలంలోని టిడిపి నాయకులను కార్యకర్తలను కొత్తగా వచ్చిన వారిని కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషిచేసి రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో అన్ని పదవులను టిడిపి పార్టీ కైవసం చేసుకునే విధంగా ఇప్పటినుంచి మీరందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, విజయ శేఖర్ రెడ్డి, ప్రసాద్ రెడ్డి, తిరుమూరు శ్రీనివాసులు రెడ్డి, నెల్లూరు సుధాకర్ రెడ్డి, అన్నమేటి చంద్రయ్య, గంగాధర్ రెడ్డి, కవిత, చిరంజీవిమ్మ, దయాకర్, బుజిగేంద్ర రావు, ద్వారకానాథ్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చాలీ చాలని కూరలతో విద్యార్థుల ఇబ్బందులు



శ్రీకాళహస్తి,జూన్ 19 ప్రభాతవార్త : స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి వారి మాతృమూర్తి, బొజ్జల బృందమ్మ బుధవారం రాత్రి ఆమె పట్టణంలోని ఎన్‌టిఆర్ నగర్‌లోని ఎస్‌టి గురుకులాన్ని సందర్శించారు. సాయంత్రం నుంచి ఇక్కడ విద్యార్థులతో మమేకమైన ఆమె కళాశాల నిర్వాహ కులను మెను గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలను వంటలకు సంబంధించి రుచి గురించి అడిగి తెలుసుకున్నారు. వడ్డింపు సందర్భంగా ఆమె దగ్గర కూర్చొన్నారు. అన్నం అయితే సరిపోతుంది కానీ ఇక్కడ తయారు చేసిన కూరలు మాత్రం చాలీ చాలకుండా ఉండటం గమనించారు.300 మంది విద్యార్థులుంటే వారికి సరిపడ్డ సాంబార్, కర్రీస్, రసం ఉండాల కదా అని ప్రశ్నించారు. అయితే తమకు అందించిన మెను వస్తువులతో తయారు చేసామని వారు బృందమ్మకు వివరించారు. దాంతో ఆమె వెంటనే జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడుతూ వంట తయారికి సంబంధించి కందిపప్పు సరిపోవటం లేదని మెనులో క్వాంటిటీ పెంచాలంటూ సూచించారు.

## గంజాయి కేసులో నిందితుడు అరెస్టు



శ్రీకాళహస్తి,జూన్ 19 ప్రభాతవార్త : పట్టణం నుంచి అక్రమంగా సాగుతున్న గంజాయి బ్యాచ్‌పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు టూటౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి వివరించారు. గురువారం గతంలో బారీ ఎత్తున చెన్నైకు అక్రమరవాణా చేస్తూ పట్టుబడిన నిందితుల్లో పరారైన నిందితుని పట్టుకున్నామని వివరించారు.ఈ సంఘటనలో గోకుల్ అనే గోకుల్ కృష్ణన్(56) అదుపులో తీసుకున్నట్లు వివరించారు.ఇతన చెన్నై సెంట్రల్‌జైలులో ఉండగా అదుపులో తీసుకొని శ్రీకాళహస్తి కోర్టుకు హాజరు పరచినట్లు సిఐ వివరించారు.

**ఎస్‌డికె నగర్‌లో మోటార్‌సైకిళ్ళ చోరీలు:**

శ్రీకాళహస్తి పట్టణంలో అభివృద్ధి చెందుతున్న ఎస్‌డికె నగర్ కాలనీల్లో రాత్రి ఇంటి ముందు పార్కింగ్ చేసిన మోటార్‌సైకిళ్ళు మాయమౌతున్నట్లు బాధితులు వాపోతున్నారు. ఈ కాలనీల్లో చెన్నై కు చెందిన యువకులు నిఘా వేసి మోటార్ సైకిళ్ళను చోరీకి పాల్పడుతున్న సమాచారం. ఈనేపథ్యంలో బుధవారం రాత్రి ఎస్ ఎస్ కన్వెన్షన్ హాల్ ఎదురుగా ఉన్న ఇళ్ళలో రెండు మోటార్ సైకిళ్ళను యువకులు తీసుకెళుతుండగా ఈ మార్గంలో రాత్రి పెట్రోలింగ్ తిరుగుతున్న పోలీసుల కంట్లో పడ్డారు. దాంతో వారిని అదుపులో తీసుకొని ఒక మోటార్‌సైకిల్‌తో పాటు బుల్లెట్ వాహనాన్ని స్వాదీనం చేసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.

**హాథీరాంజీ మఠంలో**

## తెలుగు బంజారాలకు అవకాశం ఇవ్వండి

**-టిటిడి ఛైర్మన్ నాయుడును కలసిన బిఆర్ఎస్ నేత కవిత**



తిరుమల,జూన్ 19ప్రభాతవార్తప్రతినిధి: తిరుమలలోని హాథీరాంజీ మఠంలో పూజలు,ఇతరత్రా కార్యకలాపాలకు తెలుగురాష్ట్రాలకు చెందిన బంజారా పీఠాధిపతులకు అవకాశం కల్పించాలని తెలంగాణ బిఆర్ఎస్ ఎంఎల్‌సి కవిత కోరారు.ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడును కలసి సుగాలీ,లంబాడీ పీఠాధిపతులు,పూజారులకు మఠంలో ప్రత్యేకంగా పూజలు చేసే అవకాశం కల్పించాలని కోరడంతో ఛైర్మన్ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే హాథీరాంజీబావాజీ మఠంప్రతినిధులు, గిరిజన పీఠాధిపతులతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

## సుమారు 10 వేల మందితో యోగా కార్యక్రమం : కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, జూన్ 19, ప్రభాతవార్త: తిరుపతి తారకరామ స్టేడియం నందు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా సుమారు 10 వేల మందితో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్ సంబందిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్ నందు 21వ తేదీ జరగబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమంలో ప్రజలు. పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం కావాలని ఎస్.పి హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో కలసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సంబందిత అధికారులకు దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తారకరామ స్టేడియం నందు సుమారు 10 వేల మందితో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని, అందుకు తగిన ఏర్పాట్లను పగడ్బందీగా చెపట్టాలని వివిధ శాఖలకు చెందిన అధికారులకు సూచించారు. కార్పొరేషన్ వారు శానిటేషన్, త్రాగునీరు ఏర్పాటు, వైద్య ఆరోగ్యశాఖావారు హెల్త్ క్యాంపులు నిర్వహించాలని, జిల్లాపోలీస్ యంత్రాంగం ట్రాఫిక్ నియంత్రించాలని, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలని ఆదేశించారు.